RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 278 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 అక్టోబర్ 2024 బుధవారం పేజీలు : 4

## కొత్త గ్రహాన్ని కనుగొన్న భారత శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ : విశ్వంలో మరో కొత్త గ్రహాన్ని భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అధునాతన స్పెక్టోగ్రాఫను ఉపయోగించి ఆ గ్రహాన్ని గుర్తించామని.. ఇదో అద్భుత ఆవిష్కరణ అని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్) కి చెందిన పరిశోధకులు పేర్కొన్నారు. ఈ గ్రహాన్ని టీఓఐ–6651బీగా పిలుస్తున్నామని తెలిపారు. శని గ్రహం పరిణామంలో ఉన్న ఈ ప్రత్యేక గ్రహం.. సూర్యుడిని పోలిన నక్షత్రం చుట్టూ తిరుగుతోందని వెల్లడించారు. దీని కక్ష్య కొద్దిగా అండాకారంలో ఉందన్నారు. ఇక భూమితో పోలిస్తే ఈ గ్రహం బరువు 60 రెట్లు అధికంగా ఉంటుందని, పరిమాణంలో 5 రెట్లు పెద్దదని వివరించారు.

ఈ గ్రహం అధిక సాంద్రతను బట్టి 87% రాతి, ఇనుము పదార్థాలను సూచిస్తుందన్నారు. హైడ్రోజన్, హీలియం వంటి తేలిక వాయువులు గ్రహంపై వ్యాపించి ఉండే అవకాశముందన్నారు.




# 70 ఏళ్ళు పైబడిన ప్రతి ఒక్కరికీ రూ. 5 లక్షల ఆరోగ్య బీమా

## అట్టహాసంగా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ

పేద, ధనిక తారతమ్యం లేకుండా దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి వచ్చింది. 'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' కింద తీసుకొచ్చిన ఈ సదుపాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదో ఆయుర్వేద డే సందర్భంగా ఈ పథకానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, గర్భిణులు, చిన్నారుల వ్యాక్సినేషన్ కోసం ఉద్దేశించిన యూ–విన్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఆరు కోట్లమంది సీనియర్ సిటిజన్లకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అంచనా. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతారు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు.

ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ. 5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది.

సీజీహెచ్ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పథకాల కింద ఉన్న వయోవృద్ధులు వాటిని గానీ, ఏబీపీఎంజేఏవైని గానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు.

**ఆయుష్మాన్ భారత్ కార్డు ఇలా..** ఏబీపీఎంజేఏవై పథకంలో లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. PMJAY పోర్టల్‌లో 'యామ్ ఐ ఎలిజిబుల్' ట్యాబ్‌పై క్లిక్ చేయాలి. దీంతో beneficiary.nha.gov.in అనే వెబ్‌సైట్‌కి రీడైరెక్ట్ అవుతారు. అక్కడ క్యాప్చా, మొబైల్ నంబర్, ఓటీపీ ఎంటర్ చేయాలి. తర్వాత కేవైసీ కోసం వివరాలు నమోదు చేసి.. ఆమోదం కోసం చూడాలి. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్‌లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువీకరణ పత్రాల్లో ఆధార్ ఒక్కటే సరిపోతుందని ఇటీవల రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రాసిన లేఖలో కేంద్రం పేర్కొంది.


# పోలీసులకు శుభవార్త.. ఆ నిధుల విడుదల

హైదరాబాద్: తెలంగాణ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182.48 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. పోలీస్ సిబ్బందికి సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను రేవంత్ ప్రభుత్వం భారీ స్థాయిలో విడుదల చేసింది.

182.48 కోట్ల రూపాయల మొత్తాన్ని పోలీస్ సిబ్బందికి మంజూరు చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఎంతోకాలంగా పోలీస్ సిబ్బంది ఎదురుచూస్తున్న సరెండర్ లీవ్‌లకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేయడంపై పోలీస్ అధికారుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన బకాయిలను దశలవారీగా త్వరితగతిన మంజూరు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది.

**సకాలంలో అందని 'సరెండర్' డబ్బులు :** మరోవైపు.. పోలీసు సిబ్బందికి 'సరెండర్' డబ్బులు సకాలంలో అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారాలు, సెలవులు, పండగలు... ఇతర ముఖ్యదినాల్లో సైతం పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. దానికోసం వారికి సరెండర్ (ప్రభుత్వ ఉద్యోగుల్లో కొన్ని విభాగాలకు వర్తిస్తుంది) పద్ధతి ద్వారా సెలవులు లేదా డబ్బులు ఇస్తుంటారు. అంటే ప్రతి ఏడాది రెండు సరెండర్‌లు ఉంటాయి. ఒక్కో సరెండర్ ద్వారా 15 రోజుల జీతం అదనంగా ఇస్తుంటారు. వీటిని జనవరి – జూలై నెలల్లో అందజేస్తారు.

దానికి తోడు వారికి ప్రతి ఏడాది జమయ్యే 30 ఈఎల్స్ (ఎర్న్‌డ్ లీవ్స్)లో 15రోజులకు ఎన్‌క్యాష్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అంటే నవంబర్‌లో 15 రోజుల సెలవులకు సంబంధించి




ఎన్‌క్యాష్ చేసుకుంటే వారికి ఆ డబ్బు కూడా ఇస్తారు. అయితే గతేడాది జూలై, నవంబర్, ఈ ఏడాది జనవరికి సంబంధించిన డబ్బులు చాలా మంది పోలీసు సిబ్బందికి అందలేదు.

**బీఆర్ఎస్ హయాంలో పెండింగ్‌లో మూడు సరెండర్స్ :** పోలీస్ ఉద్యోగం అంటే కత్తిమీద సాములాంటిది. ఎప్పుడు ఏ ఉపద్రవం వస్తుందోనని నిత్యం అలర్ట్‌గా ఉండాలి. ఇతర ఉద్యోగుల మాదిరిగా వీరికి పండగలు, ఆదివారం సెలవులు ఉండవు. నెలలో 30 రోజులూ డ్యూటీలో ఉండాల్సిందే. అందుకే వీరికి ప్రభుత్వం ప్రోత్సాహకంగా సరెండర్ లీవ్స్ పేరుతో ప్రోత్సాహకం అందిస్తోంది. ఉద్యోగుల సీనియారిటీని బట్టి బేసిక్‌పై సరెండర్స్ ఇస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సరెండర్స్ పెండింగ్‌లో పెట్టింది. పోలీస్ ఉద్యోగులు వాటికోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వీటిని మంజూరు చేస్తుందన్న ఆశతో పోలీసులు ఎదురుచేస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో దాదాపు 3,000 మంది పోలీసులు ఉన్నారు. వీరికి బేసిక్ ప్రకారం మూడు సరెండర్స్ పెండింగ్‌లో ఉండగా, జనవరితో నాలుగో సరెండర్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి తోడు ఆరు నెలలుగా టీఏ, నాలుగేళ్లుగా డీఏలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రావాల్సి ఉంది.

**బకాయిల విడుదలపై పోలీసుల హర్షం...** కాగా.. సరెండర్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తే పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు ఉపయోగపడతాయని చాలామంది పోలీసులు భావిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వస్తే తమ అవసరాలకు వాడుకుంటామని బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలందరి చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

అవి వస్తే ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడానికో, పిల్లలకు ఉన్నత చదువులకో, వాహన కొనుగోళ్లకో ఉపయోగపడతాయని చాలామంది ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సరెండర్స్‌పై ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందని, తొందరలోనే వచ్చే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులుగా ఎంపికై ట్రాన్స్‌కో, టెలికాం, ఆర్టీసీ, రవాణా శాఖల్లో పనిచేస్తున్న వారికి సరెండర్స్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తమకూ వస్తాయని పోలీసులు ఆశిస్తున్నారు. ఇప్పుడు సరెండర్ లీవ్‌ల బడ్జెట్ రూ.182.48 కోట్లను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేయడంతో పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## తెదేపా సభ్యత్వం తీసుకున్న బాబుమోహన్

సంగారెడ్డి : మాజీ మంత్రి, నటుడు బాబుమోహన్ తెదేపాలో చేరారు. ఆ పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. ఆందోల్ నియోజకవర్గంలో సభ్యత్వం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఓ ఫొటోను పోస్టు చేశారు.

# నవంబర్ 1

## మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు

## బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభం




## స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్ప.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యి సార్లు ఆలోచిస్తామని.. తీసుకున్నాక వెనక్కి వెళ్లేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నవంబరు 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబరులో ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు.

**మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది..** "భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి ఇబ్బంది అయితే మంత్రులు, అధికారులను కలిసి చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు పిలుస్తాం. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజాప్రతినిధులను పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపాను. ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగింది. మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. విచారణ సమయంలో కక్ష సాధింపు ఉండదు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయి. రాజకీయంగా నష్టం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరుతాం. ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న నా కల నెరవేరింది. ముఖ్యమంత్రి పదవి కంటే పెద్ద కలలు నాకు వేరే ఏమీ లేవు.

**నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది..** కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. నేను రుణమాఫీ చేశా. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశాం. మూసీ కోసం భూములిచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తాం. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోం. ప్రాజెక్టును ఎన్జీవోలు వ్యతిరేకిస్తే అర్థం ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావట్లేదు. కేటీఆర్ ప్రపంచస్థాయి మేధావిని అనుకుంటారు. మూసీని బాగు చేసే అంశంలో కేటీఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? ఈ ప్రాజెక్టుపై కేటీఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నా. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల తమ ప్రతిపాదనలు తెలపాలి. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది. 55 కి.మీ మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుతనగరం ఆవిష్కృతమవుతుంది.

**జన్వాడ ఫామ్‌హౌస్‌పై భారాస కట్టుకథలు..** "దీపావళి అంటే ఎవరైనా చిచ్చుబుడ్లు కాలుస్తారు. కానీ, జన్వాడ ఫామ్‌హౌస్‌లో మాత్రం సారాబుడ్లు బయటికొచ్చాయి. అనధికార విదేశీ మద్యంతో కేటీఆర్ దీపావళి జరుపుకొంటున్నారా? జన్వాడ ఫామ్‌హౌస్‌పై భారాస కట్టుకథలు హాస్యాస్పదం. ప్రభుత్వం చేసే మంచి పనులకు మీడియా సహకరించాలి. మూసీ పరివాహకంలో సమయం వచ్చినప్పుడు పాయాత్ర చేస్తా. అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తా. భారాస అక్రమ సొమ్ముతో సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేస్తోంది. ఎంతో ఆలోచించి హైడ్రాను రంగంలోకి దించాం. హైడ్రాపై దేశమంతా తెలిసేలా భారాస ప్రచారం చేసింది. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదు.. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చింది. సినిమాల్లో రాజమౌళి, వర్మ.. ఇద్దరిది వేర్వేరు స్టయిల్. రాజకీయాల్లో నా స్టైల్ నాది.. కేటీఆర్ స్టైల్ కేటీఆర్‌ది. రాజకీయంగా కేసీఆర్ పనైపోయింది. రూ.7.50 లక్షల కోట్ల అప్పులు కేసీఆర్ మిగిల్చి వెళ్లారు. రుణమాఫీలో సాంకేతిక లోపాలు ఉన్నవి మాత్రమే ఆగాయి. 10 నెలల్లో 50వేల ఉద్యోగాలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. టీజీపీఎస్సీ నియామకాల్లో 90శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకే. నాది చిన్నవయస్సు.. రాజకీయంగా ఇంకా భవిష్యత్తు ఉంది. అణచివేతతో ప్రజాగ్రహాన్ని మూటగట్టుకోలేను. అందరి విషయంలోనూ ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరిస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# మోడీకి బీహారీ బాబు నితీష్ క్లారిటీ ఇచ్చేశారా ?

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం రెండు ఊతకర్రల మీద ఆధారపడి సాగుతోందని ఇండియా కూటమి నుంచి తీవ్ర విమర్శలు వస్తూ ఉంటాయి ఏ క్షణాన అయినా ఎన్డీయే ప్రభుత్వం కూలిపోతుందని కూడా అంటూ జోస్యాలు చెబుతూ ఉంటారు. ఏపీలో తెలుగుదేశం బీహార్ లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీయూ ఎన్డీయేకు ప్రాణావసరంగా ఈ రోజు మారాయి. ఈ రెండు పార్టీలు కనుక ఫేస్ టర్నింగ్ ఇచ్చుకుంటే కచ్చితంగా మోడీ ప్రభుత్వం ఇబ్బందులో పడుతుంది. ఆ సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రంలో పూర్తి స్థాయిలో దోస్తీ చేస్తున్నారు. ప్రతీ దానికీ ఆయన ఢిల్లీ వెళ్లి పెద్దలను కలుస్తున్నారు. అరమరికలు లేకుండా ఈ దోస్తీ సాగుతోంది. అదే నితీష్ కుమార్ విషయం చూస్తే కనుక కొన్ని అనుమానపు మేఘాలు అయితే ప్రసరిస్తున్నాయి. దాంతోనే రాజకీయంగా ఎపుడూ అంతా బీహార్ వైపు చూస్తున్నారు. ఆ మధ్యన జేడీయూ కీలక నేత ఒకరు నితీష్ కుమార్ ప్రధాని అయితేనే దేశంలోని సమస్యలు పరిష్కారం అవుతాని కూడా ఒక బిగ్ స్టేట్మెంట్ ఇచ్చారు.మరో వైపు ఒక సందర్భంలో బీహార్ లోని ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తో నితీష్ కుమార్ భేటీ అయ్యారన్న వార్తలు కూడా కొంత రాజకీయంగా అలజడి రేపాయి. ఇక నితీష్ కుమార్ విషయం తీసుకుంటే 2020లో బీజేపీతో పొత్తు పెట్టుకుని బీహార్ లో అధికారంలోకి వచ్చారు. ఆ తరువాత కొన్నాళ్ళకు ఆర్జేడీ కాంగ్రెస్ కూటమి వైపు మళ్ళారు. మళ్లీ అటు నుంచి ఎన్డీయే కూటమి వైపు వచ్చారు. ఇలా ఒక నాలుగేళ్ల కాలంలోనే ఆయన కూటములను మారుస్తూ రికార్డు క్రియేట్ చేశారు. దాంతో నితీష్ కుమార్ వైఖరి ఎలా ఉంటుందో అన్న ఆందోళన అయితే అందరిలో ఉంది. దానిని ఆయన తాజాగా బీహార్ లో జరిగిన రాష్ట్ర ఎన్డీయే సమావేశంలో నివృత్తి చేశారు తాను ఎన్డీయేను వీడను అంటూ ఒక కచ్చితమైన స్టేట్మెంట్ ఇచ్చారు. తాను గతంలో ఇండియా కూటమి వైపు వెళ్ళి తప్పు చేశానని కూడా చెప్పుకున్నారు. తాను ఎన్డీయేలో ఉంటూ 2025లో బీహార్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి మెజారిటీని సాధించి మరోమారు అధికారం చేపడతామని స్పష్టం చేశారు. ఈసారి ఎన్డీయే కూటమి ఏకంగా 220 సీట్లను గెలుచుకుంటుందని ఆయన చెప్పడం విశేషం. మరో వైపు బీహార్ బీజేపీ నేతలు తమ నాయకుడు నితీష్ కుమార్ అని చెప్పడమూ గమనార్హం. బీహార్ కి మరోసారి నితీష్ కుమార్ ముఖ్యమంత్రి అవుతారని వారు సంకేతాలు ఇస్తున్నారు. ఆయన నాయకత్వంలోనే ఎన్డీయే కూటమి ఎన్నికలను ఎదుర్కొంటుందని అంటున్నారు. అంటే 2025లో మళ్లీ ఎన్డీయే గెలిస్తే నితీష్ కుమార్ వరసగా అయిదవసారి సీఎం అవుతారు అన్న మాట. సీఎం పదవికి నితీష్ కే కేటాయించాలని బీజేపీ తీసుకున్న తెలివైన నిర్ణయం వల్ల బీహార్ లో విజయావకాశాలు పెరగడంతో పాటు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం సుస్థిరతకు కూడా అవకాశం పెరిగింది అని అంటున్నారు. మొత్తానికి కేంద్రంలో మూడవసారి ప్రధాని అయిన నరేంద్ర మోడీ ప్రభుత్వానికి సొంతంగా బీజేపీకి మెజారిటీ దక్కకపోవడం కొంత ఆందోళన కలిగించినా నితీష్ కుమార్ లేటెస్ట్ స్టేట్మెంట్ తో క్లారిటీ వచ్చింది అని అంటున్నారు. సో ఇక మీదట జమిలి ఎన్నికల దాకా ఎన్డీయేకు ఢోకా లేదని అంటున్నారు.

# ఆరోగ్యం, వైద్య ,సాంకేతికత పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి...

**అలియాబాద్ గ్రామంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన సదస్సులో పిల్లి కృష్ణ కుమార్.**





శామీర్పేట (గరుడ వార్త) : ప్రతి ఒక్కరు తమ తమ బాధ్యతలతో పాటుగా, నేటి సమాజంలో అవసరమైన ఆరోగ్యం, వైద్యం సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని, ఈసీఐఎల్ విజిలెన్స్ టీం అధికారి పిల్లి కృష్ణ కుమార్ అన్నారు. మంగళవారం అలియాబాద్ గ్రామంలో ఈసీఐఎల్ కంపెనీ టీం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని గ్రామ సభ నిర్వహించి. విజిలెన్స్ ప్రాముఖ్యతను వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో జరుగుతున్న పరిణామాలు, అందుకు అనుగుణంగా మారాల్సిన అవసరాలపై అవగాహన కల్పించుకొని, సమాజం ధీటుగా ముందుకు సాగేలా, ప్రతి ఒక్కరు తప్పక తమ తమ బాధ్యతలు తెలుసుకోవాలని ఆయన కోరారు.అనంతరం గ్రామస్తులు అధికారులతో కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ గ్రామ ప్రత్యేక అధికారి యాదగిరి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అలియాబాద్ గ్రామం మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి, గ్రామస్తులు తాడెం కుమార్, సంజీవరెడ్డి, యాదయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కెనరా బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాల్లో పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు



శామీర్ పేట, (గరుడ వార్త) : కెనరా బ్యాంకు విజిలెన్స్ వారోత్సవాలు పురస్కరించుకొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంక్ వారోత్సవాల్లో భాగంగా ఆన్లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శామీర్ పేట కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్విజ్ , వ్యాసరచన పోటీలను నిర్వహించగా ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ స్థానం డి. శృతి, ద్వితీయ స్థానంలో యు. పల్లవి రాగా తెలుగు మీడియంలో ఎ. విజయలక్ష్మి, ద్వితీయ స్థానంలో జి. మల్లేశ్వరి నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కెనరా బ్యాంక్ విజిలెన్స్ రీజినల్ సౌత్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ గోవింద్ కుమార్ జా, శామీర్ పేట కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ పోరిక సాగర్ విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేకు ఎదురుచూపులు



పెద్దపల్లి : భూ కొలతలు, హద్దులు నిర్ణయించడంలో సర్వేయర్ల పాత్ర కీలకం. ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాల తోపాటు జిల్లా భూ కొలతలు, రికార్డుల శాఖలోనూ వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుంది.. క్షేత్రస్థాయి అవసరాలకు తగ్గట్లు వీరి నియామకం లేకపోవడంతో సర్వేల కోసం దరఖాస్తు చేసుకుని పలువురు ఎదురు చూస్తున్నారు. నాలుగు జిల్లాల్లో 14,287 సర్వే దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది.

టీఎస్‌పీఎస్సీ ద్వారా 2018లో 150 మంది సర్వేయర్ల వరకు నియామకం చేపట్టారు. వీరిని తహసీల్దార్ కార్యాలయాలతోపాటు భూ సర్వే కార్యాలయాల్లోనూ కేటాయించారు. వీరిలో పలువురు వేరే ఉద్యోగాలకు వెళ్లిపోయారు. దీంతో భూముల సర్వేకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునేవారు ఉండటం లేదు. సాధారణంగా ఆస్తుల పంపకాల సమయంలో హద్దుల నిర్ణయానికి, పక్క పక్క భూముల యజమానుల మధ్య హద్దుల గొడవ తలెత్తినప్పుడు, భూ క్రయ విక్రయాల సమయంలో సర్వేకు దరఖాస్తు చేసుకుంటారు. సర్వేయర్లు రాక, సర్వే జరగక వివాదాలు అలాగే కొనసాగుతున్నాయి. దీనిపై పెద్దపల్లి జిల్లా భూమి, కొలతలు, రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులును సంప్రదించగా.. సర్వేయర్ల కొరత ఉండటంతో భూ సర్వేలు ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రభుత్వం నియామకం చేపడితే పనులు వేగంగా పూర్తవుతాయని తెలిపారు.

**ఎప్పుడు కొలుస్తారో తెలీదు!**

భూమికి సంబంధించిన సరిహద్దులు నిర్ణయించాలని ఆయా మీ సేవ కార్యాలయాల నుంచి సంబంధిత తహసీల్దార్ల వద్దకు దరఖాస్తులు వెళ్తే.. పౌరసేవల పట్టిక ప్రకారం ఏళ్లకు ఏళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆలస్యంపై పౌరులు ఆరా తీస్తే.. సర్వేయర్లు ప్రభుత్వ పనుల్లో తీరిక లేకుండా ఉన్నారని తహసీల్దార్లు చేతులు దులుపుకొంటున్నారు. దీంతో వారు ఎప్పుడు కొలుస్తారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. రెండేళ్ల నుంచి 14,287 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం సర్వేల కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా తహసీల్దార్లు 45 రోజుల్లోగా సర్వేయర్లతో భూ కొలతలు తీసుకుని దరఖాస్తుదారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కాస్త సాఫీగా సాగడం లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 62 తహసీల్దార్ కార్యాలయాలుంటే నిబంధనల ప్రకారం 62 మంది సర్వేయర్లు ఉండాలి. ప్రస్తుతం 45 మంది మాత్రమే ఉన్నారు.

చెరువుల సంరక్షణ కోసం జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ యంత్రాంగం కదులుతోంది. 'హైడ్రా' తరహాలో ఆయా జిల్లాల్లోని కలెక్టర్ల ఆధ్వర్యంలో చెరువుల్లోని అక్రమ కట్టడాలకు సంబంధించిన పనుల్లో సర్వేయర్లు నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలు దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా.. ప్రస్తుతం చెరువుల వద్ద సర్వేలకే వీరు పూర్తి సమయం కేటాయిస్తున్నారు. దీంతో దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. చెరువుల సర్వేకు రెవెన్యూ, నీటి పారుదల, భూమి కొలతలు, రికార్డుల శాఖలతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పడగా.. సర్వేయర్లు సమగ్రంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే భూ హద్దులు కేటాయించాల్సి వస్తుంది.

పూర్వం గొలుసులతో సర్వేలు చేసేవారు. ప్రస్తుతం డిజిటల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్), లైడార్ సర్వేలు వంటి అత్యాధునిక సాంకేతిక యంత్రాలతో చేస్తున్నప్పటికీ.. ఆలస్యం జరుగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే సర్వేయర్లు వారికి అన్ని విధాలుగా సహకరించిన దరఖాస్తుదారులకు మాత్రమే సర్వేలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# నిలిచిన పురపాలిక పౌరసేవలు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘంలో గత రెండు నెలలుగా పౌర సేవలు నిలిచిపోయాయి. దీంతో జనన, మరణ, పలు ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులు లభించక పట్టణవాసులు ఇక్కట్లు పడుతున్నారు. అయిదేళ్ల క్రితం సుల్తానాబాద్ పురపాలక సంఘం ఏర్పడగా కమిషనర్‌గా రావడానికి మొదటినుంచే పలువురు విముఖత చూపుతున్నారు.

పురపాలక సంఘం ఏర్పడిన తర్వాత కమిషనర్‌గా ఏ ఒక్కరూ సంవత్సర కాలం పాటు నిలకడగా పనిచేసిన దాఖలాలులేవు. కమిషనర్ జీతం ప్రభుత్వ పద్దులనుంచి కాకుండా కేవలం మున్సిపాలిటీ పద్దులనుంచే ఇవ్వడం మూలంగా ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి పలువురు విముఖతగా చూపుతున్నట్లు సమాచారం. రెండు నెలల క్రితం కమిషనర్‌గా పనిచేసిన వేణుమాధవ్ కరీంనగర్‌కు బదిలీ కాగా హైదరాబాద్‌నుంచి శోభాశంకర్ వచ్చారు. ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం నాలుగురోజులు మాత్రమే విధులు నిర్వర్తించి అనారోగ్య కారణాల వల్ల దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. ఆతర్వాత వారంరోజుల క్రితం మంథని కమిషనర్‌ను ఇక్కడకు బదిలీ చేశారనే సమాచారం ఉన్నా ఇప్పటికీ ఆయన బాధ్యతలు చేపట్టలేదు. దీంతో గత రెండు నెలలుగా కమిషనర్ తన డిజిటల్‌కీతో జారీ చేయాల్సిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతుల జారీలేక పట్టణవాసులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో చేయాల్సిన పలు ముఖ్యమైన అభివృద్ధి పనులకు కమిషనర్ అనుమతి ఉండాల్సి ఉండగా కమిషనర్ లేక అభివృద్ధిపనులు ముందుకు సాగడం లేదు. జనన ధ్రువీకరణపత్రాలు జారీకాక పిల్లలకు ఆధార్‌కార్డులు తీసుకునేందుకు, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కాక పింఛను దరఖాస్తులు, బ్యాంక్ ప్రయోజనాలు, ఇళ్లు, భూమి యాజమాన్య మార్పులు చేయలేక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళ వారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా అలాగే అంబటి వేణు కుమార్ ఆర్థిక సాయం చేయగా, గుత్తికొండ సాయి కృష్ణ 25 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల భక్తులు మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# ఐదింట ఒక్కటే..

సుజాతనగర్ : మహిళలను ఆర్థిక శక్తిమంతులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం 'ఇందిరమ్మ మహిళా శక్తి పథకం' అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంత అతివలను పారిశ్రామిక వేత్తలుగా మార్చాలనేదే దీని ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగా 'మహిళా శక్తి' క్యాంటీన్‌లను ఏర్పాటు చేయిస్తోంది. వీటిని ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగిస్తోంది. అయితే జిల్లాలో దీనికి సంబంధించిన ప్రక్రియ మందకొడిగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో తొలివిడతగా 5 మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వీటికి గాను స్వయం సహాయ సంఘాల సభ్యులు, స్థలాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని కొద్ది రోజుల క్రితమే ఉన్నతాధికారులు ప్రకటించారు. జన సంచారం అధికంగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు, లేదా ప్రాంతాలను ఎంపికకు చర్యలు చేపట్టారు. నిర్వాహకులకు అద్దె భారం లేకుండా చూసేందుకు ప్రభుత్వ భవనాల్లోనే క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనేది ఉన్నతాధికారుల ఉద్దేశం. ఈ క్రమంలో ఇటీవల కలెక్టరేట్‌లో తొలి 'మహిళా శక్తి క్యాంటీన్'ను ప్రారంభించారు. ఇప్పుడది విజయవంతంగా లాభాల బాటలో కొనసాగుతోంది. మణుగూరులో ఏరియా ఆసుపత్రి ప్రాంతంలో రెండో క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. మిగతా వాటిని ఏర్పాటు చేసేందుకు భద్రాచలం ఐటీడీఏ, పాల్వంచ పట్టణం, జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాల కొరతే ప్రధాన సమస్యగా మారినట్లు తెలుస్తోంది. అవసరమైతే ప్రత్యామ్నాయాన్ని చూపైనా వేగంగా ఉపాధి కల్పించాలని స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

**సంఘాల సభ్యులకు పది రోజుల శిక్షణ**

**–విద్యాచందన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి**

మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణకు ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఈ నెలాఖరున హైదరాబాద్‌లో హెూటల్ రంగం నైపుణ్యాలపై పది రోజుల ఉచిత శిక్షణ ఏర్పాటు చేశాం. ప్రముఖ సంస్థ నిపుణులు మహిళలకు క్యాంటీన్ నిర్వహణపై తర్ఫీదు ఇస్తారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మొత్తం 5 క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఒకటి విజయవంతంగా నడుస్తోంది.

# భయపడతూ చదవాల్సిందేనా..?

కారేపల్లి : రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం ప్రమాదకరంగా తయారైంది. విద్యార్థులు, అధ్యాపకు లు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి దాపురించింది. 1999లో భవన నిర్మాణం పూర్తవటంతో అదే ఏడాది నుంచి తరగతులు మొదలయ్యాయి. అంతకు ముందు పక్కనే ఉన్న జడ్పీ పాఠశాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాఠశాల, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కళాశాల తరగతులు నిర్వహించేవారు.

గతమెంతో ఘనం..!ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి ఇంటర్ బోర్డు అధికారుల ప్రశంసలందుకుంది ఈ కళాశాల. ఏటా వందలాది మంది విద్యార్థులు చేరుతున్నారు. మరుగుదొడ్లు లేక ఎదురవుతున్న ఇబ్బందులపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 2004 నవంబర్‌లో కళాశాల విద్యార్థులు ఫిర్యాదు చేశారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన న్యాయస్థానం.. 2005లో తీర్పు వెలువరించింది. అప్పట్లో సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 805 ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించింది. ఇంతటి చరిత్ర కలిగిన కళాశాల నేడు సమస్యల వలయంలో చిక్కుకుంది. పెచ్చులూడి ఇనుప రాడ్లు తేలుతున్నాయి. వీటికి తోడు భవనం వెనుక అడుగు భాగం నుంచి నీళ్లు ఉబికి వస్తుండటంతో ప్రాంగణం, గదుల్లో బండలు కుంగిపోతున్నాయి. చెమ్మ వల్ల గోడలకు విద్యుత్తు ప్రసరణ జరుగుతుందనే విషయం తెలియటంతో కొద్దిరోజులుగా ఆ గదులకు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కార మార్గం చూపాలని ప్రధానాచార్యులు విజయకుమారి కోరుతున్నారు.

# స్థల పంచాయితీ

సారంగాపూర్ : మండలంలోని ఓ గ్రామంలో కొంత కాలంగా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోకి డీసీఎంఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో గ్రామంలో వివాదం నెలకొంది. రైతులతో కలిసి నిర్వాహకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకొనే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన స్థలంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రాన్ని మంజూరు చేయడంతో స్థల విషయంలో ఇరు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారితీసింది. కేవలం ఇక్కడే కాకుండా జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇదే సమస్య నెలకొంది. అయితే కొన్ని కేంద్రాలను అధికారులు కుదించినప్పటికీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు మళ్లీ మంజూరు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఒక్కో గ్రామానికి రెండేసి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయడం..

ఉన్న కేంద్రానికి సరైన స్థలం లేకపోవడంతో మరో కొనుగోలు కేంద్రాన్ని కేటాయించడంతో గ్రామాల్లో వివాదాలు నెలకొంటున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలకు గాను జిల్లా వ్యాప్తంగా 427 కొనుగోలు



కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ ద్వారా 175, సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లకు 251, మెప్మా ద్వారా ఒక కొనుగోలు కేంద్రం అప్పగించారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో సేకరణ వేగవంతం అవుతున్నప్పటికీ స్థలాలు లేకపోవడంతో రైతులకు ఇబ్బందిగా మారింది.

నిర్వాహకులకు తాఖీదులు

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యానికి వచ్చే కమీషన్‌లో సగానికిపైగా నిర్వహణ వ్యయం చేయడంతో జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఒక్కో కేంద్రంలో కనీసం 5 వేల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసినప్పుడే నిర్వహణ వ్యయం తగ్గి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే పలు కొనుగోలు కేంద్రాలలో 2 నుంచి 3 వేల క్వింటాళ్ల సేకరణ దాటకపోవడంతో ఆయా కొనుగోలు కేంద్రాలకు నిర్వహణ వ్యయం పెరిగి నష్టాలు వస్తున్నాయి. అంతేకాకుండా కొన్నేళ్లుగా కమీషన్ పెంచకపోవడం.. వ్యయ భర్తులు పెరగడం నిర్వాహకులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కరువు

గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేకపోవడంతో పంట పొలాలు, రహదారుల వెంట ధాన్యాన్ని ఆరబోయాల్సి వస్తోంది. వానాకాలం తేమ శాతం ఎక్కువగా ఉండడంతో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు స్థలం ఎక్కువగా అవసరం ఉండడమే కాకుండా ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని ఉంచాల్సిన పరిస్థితితో స్థలాల సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. పంట పొలాల్లో ఆరబెట్టుకునేందుకు ధాన్యం పోసినప్పుడు వర్షాలు పడితే రైతుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ పెంచి కొనుగోళ్లను వేగవంతం చేసినప్పుడే సమస్యలు రాకుండా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.

# అనాథల పెన్నిధి.. అభాగ్యుల సన్నిధి

మఠంపల్లి : ఆధ్యాత్మిక జీవనం గడుపుతున్న ఓ యువ విద్యావేత్త అభాగ్యులతో పాటు అనాథలను ఆదుకోవాలని భావించారు. మానవ సేవే మాధవ సేవగా తలంచారు. ఓ క్రైస్తవ మిషనరీ సంస్థ నడుపుతున్న విద్యాలయానికి వ్యవహారకర్తగా, ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూనే మురికి వాడల్లో నివసించే దీనులను, వీధి బాలలను ఆదుకునేందుకు విదేశాలలో ఉంటున్న మిత్రుల సహాయాన్ని కోరారు. సన్నిహితుల దాతృత్వానికి తన వితరణను జోడించి కూడు, గూడు లేని దీనులతో పాటు తల్లిదండ్రులకు దూరమైన వీధి బాలలను, అనాథలను ఆదుకుంటున్నారు. పేదరికంతో చదువులు కొనసాగించ లేని విద్యార్థులను గుర్తించి వారికి ఉపకార వేతనాలు అందిస్తూ ఉన్నత విద్యలకు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. పూరిగుడిసెల్లో నివసిస్తూ ఆకలితో అలమటించే అర్హులకు ప్రతి నెలా బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నారు.

సేవా నిరతిని చాటుకుంటున్నారిలా..మఠంపల్లికి చెందిన తిరుమలరెడ్డి తోమాస్‌రెడ్డి, సెలీనమ్మ కుమారుడు ఫాదర్ టీఆర్ బాలజోజిరెడ్డి గురువుల స్ఫూర్తితో ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎడ్, ఎంబీఏ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెడన మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సెయింట్ విన్సెంట్ పల్లోటీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అండ్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్నారు. 2007 నుంచి విద్యా బోధనలో తరిస్తున్న ఫాదర్ 2018లో తన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు.



పెడన పట్టణ పరిధిలో 30 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నారు. కొవిడ్–19 సమయంలో 40 రోజుల పాటు తమ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో నిత్యం 400 మందికి అన్నం ప్యాకెట్లు సరఫరా చేశారు. 45 మంది వీధి బాలలను, 35 మంది అనాథలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు నోటుపుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నారు. 100 మందికి పైగా పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ఉన్నత విద్యలకు తోడ్పాటు నందిస్తున్నారు. మఠంపల్లిలో ఒంటరి మహిళలు, వితంతువులకు 2021 నుంచి ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణానంతరం రాయితీపై మిషన్లు అందజేస్తున్నారు. నిస్సహాయులైన 100 మంది వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయడం వంటివి గత ఆరేళ్లుగా కొనసాగిస్తున్నారు. సామాజిక బాధ్యతతోనే ఇలాంటి కార్యక్రమాలను మిత్రబృందం సహాయంతో చేపడుతున్నట్లు ఫాదర్ బాలజోజిరెడ్డి చెప్పారు.

# చన్నీళ్ల స్నానం.. వెంటిలేటర్ల నుంచి గాలి



సిరిసిల్ల : వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం చలి కావడంతో పిల్లలు పడుతున్న బాధలు వర్ణణాతీతం. కొన్ని చోట్ల కనీసం దుప్పట్లు ఇవ్వలేదు. చలిలో చన్నీళ్లతో స్నానం చేస్తుండటంతో వణుకుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతుంది. చలికాలం కావడంతో ప్రభుత్వం దుప్పట్లు అందజేసినా వెంటిలేటర్ల నుంచి చలివేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం చన్నీళ్లతో స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిటికీలకు జాలీలు కూడా లేవు. తెల్లవారుజామున చలి ఎక్కువగా వస్తుందని విద్యార్థులు తెలిపారు.

జిల్లాలోని వసతి గృహాల వివరాలు

జిల్లాలో మొత్తం 9 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ప్రీ మెట్రిక్ 3 నుంచి 5వ తరగతి వరకు అయిదు ఉండగా, వీటిలో 214 మంది విద్యార్థులు ఉంటున్నారు. పోస్ట్‌మెట్రిక్, ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు నాలుగు వసతి గృహాలు ఉండగా 355 మంది చదువుకుంటున్నారు. ఎస్సీ వసతి గృహాలు ప్రీ మెట్రిక్ 9 ఉండగా 484 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 3 ఉండగా 230 మంది ఉన్నారు. ఎస్టీ ప్రీ మెట్రిక్ హాస్టల్ ఒకటి ఉంది. ఇందులో 37 మంది ఉంటున్నారు.

తెరలు తొలగిపోతున్నా...

మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. వార్డెన్ లేకపోవటంతో ఎస్సీ బాలికల వసతి గృహం వార్డెన్ వసంతకు బాధ్యతలను అప్పగించారు. చలికాలం కావటంతో ముందస్తుగానే విద్యార్థులకు దుప్పట్లు అందించారు. దోమలు రాకుండా కిటికీలకు ఏర్పాటు చేసిన తెరలు తొలగిపోతున్నాయి. విద్యుత్తు వైర్లు సక్రమంగా లేవు. వదులు తీగలతో ప్రమాదకరంగా మారాయి. తెరలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై వార్డెన్‌ను వివరణ కోరగా కోతుల బెడద తీవ్రంగా ఉందని, కోతులు తెరలను తొలగిస్తున్నాయని తెలిపారు.

దుప్పట్లు ఏవి?

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల, వసతి గృహంలో 96 మంది ఉంటున్నారు. సుమారు 35 మంది విద్యార్థులకు మంచాలు లేవు. దీంతో కిందనే నిద్రిస్తున్నారు. పాఠశాల పునఃప్రారంభం తరవాత బెడ్‌షీట్లు, కార్పెట్లు అందించారు. చలికాలం ప్రారంభమైంది. స్వెట్టర్లు, దుప్పట్లు అందించాల్సి ఉన్నా నేటికీ అందలేదు. దీంతో విద్యార్థులు అందుబాటులో ఉన్న బెడ్‌షీట్లు, చద్దర్లు కప్పుకుంటున్నారు.

కొత్తవి ఏర్పాటు చేయక...

మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, కళాశాల ఉన్నాయి. అందులో అయిదు నుంచి 10వ తరగతి వరకు 469 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 126 మంది ఉన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు మొత్తం 98 కిటికీలు ఉండగా 36 కిటికీల జాలీలు దెబ్బతిన్నాయి. కొత్తవాటిని ఏర్పాటు చేస్తే చలి రాకుండా ఉంటుంది. దీనిపై ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా జాలీల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. కళాశాల ల్యాబ్‌ల కోసం గదుల కొరత ఉండగా రూ.కోటి వ్యయంతో భవన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలో 9 బీసీ వసతి గృహాలు ఉండగా వీటిలో 6 ప్రభుత్వ, 3 ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ వసతి గృహాలకు గత కొన్ని నెలలుగా అద్దె విడుదల చేయలేదు. వాటిలో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే యజమానులు చేయిస్తున్నారు. పెద్దవి అయితే అద్దె చెల్లిస్తేనే చేస్తామంటున్నారు.

రాజమనోహర్‌రావు, జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి

# అభివృద్ధి జాడ.. జిల్లా అంతా 'సుడా'!




కరీంనగర్: సుడా పరిధి పెరిగింది. అభివృద్ధి జాడలను మరింత విస్తరించుకుంది. కరీంనగర్ జిల్లా మొత్తం ఇక శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) పరిధిగా మారిపోనుంది. ఇందుకు సంబంధించి రాజముద్రను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. గతంలో పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈనెల 15వ తేదీన ఉత్తర్వులను వెల్లడించింది. చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి వరకు.. గన్నేరువరం మండలం పారువెల్ల నుంచి కరీంనగర్ గ్రామీణ మండలం దుర్శేడ్ వరకు ప్రతి గ్రామం పట్టణాభివృద్ధిలో భాగంకానుంది.

ఏడేళ్ల కిందట ఏర్పాటైన సుడా క్రమంగా విస్తరించింది. మొదట కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు 61 రెవెన్యూ గ్రామాలతో ముడిపడిన ప్రాంతంగా ఆవిర్భవించింది. ఇందులోనే కాలక్రమంగా కొత్తపల్లి పురపాలిక అంతర్భాగమైంది. ఒక నగరపాలక సంస్థ, ఒక పురపాలికతోపాటు మిగతా గ్రామాలపై పర్యవేక్షణ కొనసాగింది. పెరుగుతున్న జనాభా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పరిధిని మరింత విస్తరించాలనే డిమాండ్ కొన్నాళ్లుగా వినిపించింది. ఇందుకనుగుణంగా ఇప్పుడు కొత్తగా అభివృద్ధికి చిగుర్లు తొడిగేందుకు మిగతా 3 పురపాలికలు (జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి)తోపాటు 147 రెవెన్యూ గ్రామాలను కలుపుకొని సరికొత్త పట్టణాభివృద్ధి సంస్థగా రూపుదిద్దుకుంది. మొత్తంగా జిల్లాలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలు, మధిర గ్రామాలన్నీ సుడాలోకి వచ్చేశాయి.

మారిన స్వరూపం..

విస్తరించిన పరిధితో సుడా స్వరూపం పూర్తిగా మారిపోయింది. 2017 అక్టోబరు 24న సుడా ఏర్పాటైంది. సరిగ్గా ఏడేళ్ల తరువాత మళ్లీ విస్తరణకు ఆదేశాలొచ్చాయి. అప్పుడు 8 మండలాల్లో ఉన్న పరిధి 16 మండలాలకు మారింది. 4.59 లక్షల జనాభా 527.29 చ.కి.మీ విస్తీర్ణం ఉండేది. ఇప్పుడు దాదాపు 11 లక్షల జనాభాతో జిల్లా భౌగోళిక విస్తీర్ణం 2128 చ.కి.మీ సుడాలో కలిసిపోయింది. భవిష్యత్తులో బృహత్తర ప్రణాళికను అంతటా అమలు చేస్తే సరికొత్త అభివృద్ధి అన్ని గ్రామాల్లో కనిపించే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సమృద్ధిగా అందుతాయి. విస్తరణతో ప్రగతి పరంగా కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రణాళికాయుతంగా..

పరిధి పెరగడంతో ప్రణాళికాయుతంగా అభివృద్ధిని చేసుకునే అవకాశముంటుంది. ప్రజలకు అందించే సేవలో మా బాధ్యత పెరగనుంది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. పెరిగిన తీరునుబట్టి సిబ్బంది నియామకంతోపాటు నిధులు మరిన్ని తీసుకొచ్చే దిశగా ప్రత్యేక చొరవ చూపిస్తాను. ఇక్కడ అక్కడ అని తారతమ్యం లేకుండా జిల్లా అంతా సమానాభివృద్ధికి అవకాశం ఉంటుంది.

కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా ఛైర్మన్

# బోర్డులు పెడితే వదిలేస్తామా..?

హైదరాబాద్ : శంషాబాద్ విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరుగుతుండడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ ఖాళీ స్థలాలపై పడుతోంది. ముందుగా తాత్కాలిక షెడ్లు వేసి పనికానిచ్చేస్తున్నారు. ఈ క్రమంలోనే సర్వే నంబరు 626లో 12 ఎకరాల భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారు. శంషాబాద్ రెవెన్యూ అధికారులు కొద్దిరోజుల క్రితం తాత్కాలిక నిర్మాణాన్ని తొలగించి ప్రభుత్వ భూమి అంటూ బోర్డు ఏర్పాటు చేశారు. మరుసటి రోజే అక్రమార్కులు దాన్ని తొలగించి రేకులతో షెడ్డు వేశారు. మళ్లీ అధికారులు రేకులను తీసేయంతో కబ్జాదారులు ఈసారి ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. హెచ్‌ఎండీఏకు భూములిస్తే... శంషాబాద్ మండలంలోని రాళ్లగూడ రెవెన్యూ పరిధిలో సర్వేనంబరు 626లో 360 ఎకరాల సర్కారీ భూములను కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించింది. మొత్తం భూమిలో 12 ఎకరాల్లో గుట్టలు, రాళ్లు ఉండడంతో అధికారులు పట్టించుకోలేదు. విమానాశ్రయం, బాహ్యవలయ రహదారి ఈ భూములకు సమీపంలో ఉండడంతో అక్రమార్కులు ఆ 12 ఎకరాలను సొంతం చేసుకునేందుకు నకిలీ పత్రాలు సృష్టించారు. అధికారులు మూసీ పునరుజ్జీవం పనుల్లో ఉండడంతో అక్రమార్కులు వేగంగా పావులు కదిపారు. వారం రోజుల్లోనే భారీ పొక్లెయిన్లతో మొత్తం చదును చేశారు.

సీసీ కెమెరాలతో నిఘా... 12 ఎకరాల్లో ఏడెకరాల ప్రభుత్వ భూమి



వారసత్వంగా వచ్చిందంటూ ఓ ప్రైవేటు వ్యక్తి కంటెయినర్‌ను ఆ స్థలంలో ఉంచారు. మరో 5 ఎకరాల్లో ఇంకో వ్యక్తి ఇనుప కంచెలు, రేకులతో షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆక్రమించుకున్న స్థలం వద్దకు ఎవరొచ్చినా తెలుసుకునేందుకు వీలుగా వారు అక్కడ సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. ఈ భూములకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కొంత మంది స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి క్రయవిక్రయాలు చేయడమే కాకుండా నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

# పత్తి రైతుకు మద్దతు కరవు

మోత్కూరు : వర్షాలు, చీడపీడలను ఎదుర్కొని పత్తి పండించిన రైతుకు ఏరివేత కష్టాలు మొదలయ్యాయి. కూలీలు దొరక్కా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఏరిన పత్తిని అమ్ముదామంటే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభంకాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ధర తగ్గించడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని కర్షకులు దిగులు చెందుతున్నారు.

కిలో లెక్కన కూలికి డిమాండ్

పత్తి ఏరేందుకు కూలీలకు రోజుకూలి రూ.300 నుంచి రూ.350 వరకు ఇస్తున్నారు. కొన్నిచోట్ల కిలోలెక్కన కూలి ఇస్తేనే వస్తామని కూలీలు స్పష్టం చేస్తున్నారు. సేకరించిన పత్తి కిలోకు రూ.12 నుంచి రూ.13 వరకు అడుగుతున్నారు. ఇలా రెండు రకాలుగా కూలి ఇద్దామన్నా కొందరు పనికి రావడం లేదు. కిలోకు రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పైగా కూలీలను తీసుకెళ్లేందుకు ఆటో, మధ్యాహ్నం శీతల పానీయాలకు ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతులంతా ఒకే సమయంలో దూది సేకరిస్తుండటంతో కూలీల కొరత ఏర్పడింది.

ధర తగ్గించి కొనుగోళ్లు

కూలీలకు ఎక్కువ కూలి చెల్లించి దూది సేకరించినా సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక రైతులకు అమ్మకం కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ సారి పత్తికి క్వింటాకు మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తామని



ప్రకటించింది. మొదటి విడతలో పత్తి విక్రయించిన రైతులకు ప్రైవేట్ వ్యాపారులు రూ.ఏడు వేల వరకు చెల్లించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కావడంతో ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా మారి రూ.5,500లకు ధర తగ్గించేశారు. ఒత్తిడి తెస్తే రూ.ఆరు వేలకు కొంటున్నారు. తేమ, నాణ్యత లేదని కోతలు విధిస్తూనే తూకంలో మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పండగ తర్వాత ప్రారంభిస్తాం– ఉమామహేశ్వర్‌రావు, మార్కెట్ కార్యదర్శి, మోత్కూరు

మోత్కూరు ప్రాంతంలో ఆరు పత్తి మిల్లులున్నాయి. వీటిల్లో నవంబరు మొదటి వారంలో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం. ప్రస్తుతం తేమశాతం అధికంగా ఉంది. అందుకే పండగ తరువాత కొనుగోళ్లు చేపడతాం.

పొద్దంతా ఏరితే తక్కువ కూలా?

– వేముల పద్మ, కూలీ, బుజిలాపురం

పత్తి ఏరేందుకు కూలికి పోతే రూ.300 నుంచి రూ.350 వరకే ఇస్తున్నారు. పొద్దంతా ఎండలో ఏరితే తక్కువగా కూలి ఇస్తున్నారని ఎక్కువ మంది రావడం లేదు. కిలోకు రూ.12 నుంచి 15 వరకు ఇస్తేనే వస్తామంటున్నారు. కిలో లెక్కన రోజుకు 40 నుంచి 50 కిలోల దూది ఏరితే గిట్టుబాటు అవుతుంది.నష్టాలే మిగులుతున్నాయి..– బొమ్మగాని లక్ష్మయ్య, రైతు, లక్ష్మీదేవికాల్వఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వేల దాకా ఖర్చయ్యింది. దిగుబడి ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లే వస్తోంది. ముసురు వానలకు గూడ రాలిపోయి దిగుబడి తగ్గింది. పత్తి ఏరేందుకు రోజు కూలి రూ.400 ఇస్తామన్నా కూలీలు రావడం లేదు. ఇటు వ్యాపారులూ క్వింటాకు మద్దతు ధరకంటే తక్కువగా రూ.5,900లకే కొంటున్నారు. ఈసారి రైతులకు ఏమీ మిగిలే పరిస్థితులు లేవు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరిస్తే కొంత ఊరట లభిస్తుంది.

# నాడు ఆహ్లాదం.. నేడు అధోగతి

పాల్వంచ : కేటీపీఎస్ 'ఏ' కాలనీలోని 'విద్యుత్ కళా భారతి' కళతప్పి కనిపిస్తోంది. నిర్వహణను విద్యుత్తు సంస్థ అధికారులు పక్కనెట్టేశారు. తాజాగా జెన్కో క్రీడాపోటీల నేపథ్యంలోనైనా పూర్వ కళ సంతరించుకునేలా ఏర్పాట్లు పునరుద్ధరించాలని పురవాసులు, కేటీపీఎస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు. కేటీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబాల వ్యాహ్యాళి, జెన్కో క్రీడా పోటీల నిర్వహణకు దశాబ్దాల క్రితం 'కళా భారతి' మైదానాన్ని పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేశారు. సంస్థకు చెందిన వారే కాకుండా, పురపాలకానికి చెందిన పలు వార్డుల ప్రజలు నడక సాధన, చిన్నారుల ఆటవిడుపు కోసం ఇక్కడకు వస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే వీరి సంఖ్య సుమారు వెయ్యి వరకు ఉంటుంది. కొన్నేళ్లుగా మైదానం నిర్వహణపై కేటీపీఎస్ యాజమాన్యం శీతకన్ను వేస్తోంది. వాకింగ్‌కు వచ్చేవారి సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోతోంది. కనీసం కాపలా వంటి ఏర్పాట్లూ లేకపోవడం, రాత్రుళ్లు నిర్మానుష్యంగా ఉంటుండటంతో మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకూ వేదికగా వాడుకుంటున్నారు. ఆవరణంలో పెరిగే పచ్చిక కోసం వచ్చే పశువుల తాకిడి ఎక్కువైంది. మరోవైపు శునకాల సంచారం నడక సాధకులను బెంబేలెత్తిస్తోంది. లక్షకు పైగా జనాభా గల పట్టణంలో ఉదయం, సాయంత్రం నడకకు ఎక్కువ సంఖ్యలో కళాభారతికే వస్తుంటారు. వచ్చేనెల 7వ తేదీ నుంచి టీజీ జెన్కో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నారు. కనీసం మైదానాన్ని శుభ్రం చేసి.. ఆటసామగ్రికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

కాపలాదారుణ్ని నియమించాలి

పట్టణం నడిబొడ్డున ఉన్న మైదానానికి గతంలో వేలాది మంది తరలివచ్చేవారు. రాత్రాను ఏర్పాట్లు, నిర్వహణపై దృష్టి తగ్గింది. కనీసం కాపలా అంటూ ఏమీ లేక కొందరు మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కనీసం సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేస్తే రక్షణ, నిర్వహణకు వెసులుబాటు కలుగుతుంది. మరిన్ని సదుపాయాలు కల్పిస్తే పూర్వ వైభవం వస్తుంది.– దుర్గాప్రసాద్, పాల్వంచ

వసతులు కల్పిస్తే బాగు – రవీందర్, స్థానికుడు

ఉద్యోగులు, స్థానికులు వందలాది మంది మానసిక ఉల్లాసం కోసం రెండు పూటలూ తరలివస్తారు. ఉద్యోగాలకు సిద్ధమయ్యే కొందరు యువత వ్యాయామాలు, పరుగు సాధన చేస్తుంటారు. పిల్లల ఆటసామగ్రితో పాటు మరిన్ని వసతులు కల్పిస్తే మరింత ప్రయోజనంగా ఉంటుంది.

నిరుపయోగంగా పిల్లల ఆట సామగ్రి

కళాభారతి సమస్యలను కేటీపీఎస్ సివిల్ ఈఈ రాజీవ్ దృష్టికి తీసుకెళ్లగా.. మైదానం పరిశుభ్రతకు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. వసతులు కల్పించాలన్న పురవాసులు డిమాండ్‌ను పరిశీలిస్తామని చెప్పారు.

# కిన్నెరసానికి మెరుగులు..
## పర్యాటక సొబగులు

పాల్వంచ : కిన్నెరసాని ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు ప్రకృతి అందాలకు నెలవుగా మారాయి. పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, రిజర్వాయర్‌లో బోటింగ్ సౌకర్యం ఉండటంతో పర్యాటకులు అధికంగా వస్తుంటారు. దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించటంతో అధికారులు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఇటీవల ఇక్కడ పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.

సమకూరనున్న వసతులు

కిన్నెరసాని టోల్‌గేట్ నుంచి డ్యాం వరకు రూ.1.50 లక్షలతో సౌర విద్యుద్దీపాలు అమర్చుతున్నారు. ఇక ఈప్రాంతంలో రాత్రిపూట వెలుగులు ప్రసరించనున్నాయి. అద్దాల మేడ, కాటేజీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పర్యాటకులు భోజనం చేసే షెడ్డును వినియోగంలోకి తీసుకురానున్నారు. కోతులు రాకుండా దీనిచుట్టూ ప్రహరీ నిర్మించి ఫెన్సింగ్ వేయనున్నారు. ఇందుకోసం రూ.12 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. పార్కు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో రూ.18లక్షలతో ఇందిరామహిళాశక్తి క్యాంటీన్



ఏర్పాటుచేయనున్నారు.

రద్దీకి అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించనున్నారు. అదనంగా నాలుగు సెప్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేయనున్నారు.

వర్షాకాలంలో టోల్‌గేట్ రోడ్డుపై గుంతల్లో నీరు నిలుస్తుండటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. ఉపాధి హామీ పథకం కింద రూ. 49లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. పర్యాటకులు కూర్చోవటానికి వీలుగా మరికొన్ని బెంచీలను సమకూర్చనున్నారు. కాల్వ పక్కనే నడక దారి నిర్మించనున్నారు. ఎఫ్‌బీఓ రాములుతో మాట్లాడుతూ కలెక్టర్ సూచనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.


పర్యాటకుల విజ్ఞప్తి మేరకు పర్యాటక విద్యాకేంద్రం సమీపంలో పెద్ద గుంతలు తవ్వించి పెడల్ బోట్ సౌకర్యం కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. సమీపంలోని బాతుల కొలను నుంచి పైపులైన్ వేయనున్నారు. దీనికి రూ.10లక్షలు అవసరమని ప్రతిపాదించారు. మరో రెండు పగోడాలు నిర్మించనున్నారు.

# 'సీతారామ'లో మరో ముందడుగ

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంలో మరో ముందడుగు పడింది. పాలేరు లింక్ కెనాల్ నిర్మాణంలో భాగంగా 10.5 కి.మీ. ప్రధాన కాల్వ నిర్మాణానికి నీటిపారుదలశాఖ టెండర్లు పిలిచింది. ఖమ్మం జిల్లా పరిధిలో చేపట్టనున్న ఈ కాల్వ నిర్మాణానికి రూ.191కోట్లు కేటాయించింది. 6వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే సామర్థ్యంతో ప్రధాన కాల్వ 113.5 కి.మీ. నుంచి 10.5 కి.మీ. పొడవుతో దీన్ని నిర్మించనున్నారు.

ఎట్టకేలకు 13వ ప్యాకేజీ పనులకు మోక్షం

ఖమ్మం జిల్లా పాలేరు జలాశయంలోకి గోదావరి నీటిని మళ్లించేందుకు చేపట్టిన కాల్వను పాలేరు లింక్ కెనాల్‌గా పరిగణిస్తున్నారు. దీన్ని 13, 14, 15, 16 ప్యాకేజీలుగా విభజించారు. ఖమ్మం జిల్లా నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. ఇందులో 14, 15, 16 ప్యాకేజీలకు గతంలోనే టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. 13వ ప్యాకేజీలో అలైన్‌మెంట్ మార్చాల్సి రావటంతో టెండర్ ప్రక్రియ



నిలిచిపోయింది. మొదట 104.4 కి.మీ. వద్ద నుంచి పాలేరు లింకు కెనాల్ ప్రారంభించాలనుకున్నారు. కానీ మధ్యలో సొరంగాలు తవ్వాల్సి రావటం, ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని తెలియటంతో టెండర్లు పిలవలేదు. అలా కాకుండా 104.4 కి.మీ నుంచి 113.5 కి.మీ వరకు ప్రధాన కాల్వ తవ్వి అక్కడి నుంచి పాలేరు లింకు కెనాల్ ప్రారంభించాలని నిర్ణయించారు. ఆమేరకు తాజాగా రూ.191కోట్లతో టెండర్లు పిలవటంతో ఎట్టకేలకు 13వ ప్యాకేజీ పనులకు మోక్షం లభించినట్లైంది.

14వ ప్యాకేజీపై దృష్టి సారిస్తేనే..

సీతారామ ప్రధాన కాల్వ పనులను 16 ప్యాకేజీలుగా విభజించారు. ఇందులో 1-8 వరకు ప్యాకేజీల్లో 104.4కి.మీ ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తయింది. సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పరిధిలోకి వచ్చే 9-12 ప్యాకేజీల్లో ప్రధాన కాల్వ 66.62కి.మీ పూర్తవగా.. మిగతా పనులు కొనసాగుతున్నాయి. పాలేరు లింక్ కెనాల్ పరిధిలో 13-16 ప్యాకేజీలుండగా.. 15, 16 ప్యాకేజీల్లో పనులు జరుగుతున్నాయి. తాజాగా 13వ ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిచారు. 14వ ప్యాకేజీ నిర్మాణానికి భూమిని సేకరించినా రైతులకు పరిహారం డబ్బులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారిస్తే సీతారామ ప్రధాన కాల్వకు సంబంధించిన అన్ని ప్యాకేజీల్లో పనులు సాగుతాయి.

ఎనిమిదో ప్యాకేజీలో టన్నెల్..

పాలేరు లింకు కెనాల్ పరిధిలోని 13-16 ప్యాకేజీల్లో కాల్వ తవ్వకాలు పూర్తయితే సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పరిధిలోని 9-12 ప్యాకేజీల పనులతో సంబంధం లేకుండా గోదావరి జలాలను పాలేరు రిజర్వాయర్‌లోకి మళ్లించవచ్చు. అయితే ప్రధాన కాల్వ నిర్మాణంతో పాటు ఎనిమిదో ప్యాకేజీలో 110.650కి.మీ. నుంచి 112.30కి.మీ. మధ్య 1.65కి.మీ, పాలేరు లింక్ కెనాల్ 63.60కి.మీ. నుంచి 73.025కి.మీ. మధ్య 7.975కి.మీ. టన్నెల్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే 16వ ప్యాకేజీలోని టన్నెల్ పనులు కొనసాగుతుండగా.. ఎనిమిదో ప్యాకేజీ టన్నెల్ పనులు ప్రారంభించాల్సి ఉంది.

# ఆఫ్రికా చేప.. ఆహా..!



నల్గొండ : మత్స్యకారుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా 'కేజ్ కల్చర్'(పంజరపు సాగు) విధానంతో ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయి. మూసీ ప్రాజెక్టులో ఈ విధానంతో మత్స్యకారులు మేలైన పెంపకం చేస్తూ లాభసాటిగా చేపల విక్రయాలు చేపడుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో పెంపకం చేపడితే చేపలు చనిపోవడం, తక్కువ పరిమాణం ఉన్న చేపలను పెంచితే అవీ ఎదుగుదల లేకపోవడం మూలంగా ఏటా వారు నష్టపోతున్నారు. ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం నదుల్లో ఈ విధానాన్ని ప్రోత్సహించడమే కాకుండా రాయితీ సౌకర్యాలు కల్పిస్తుంది.

నల్గొండ- సూర్యాపేట జిల్లాల్లోని నకిరేకల్, కేతేపల్లి, తదితర మండలాల పరిధిలోని మత్స్యకారులు ఉమ్మడిగా చేపల పెంపకం చేపడుతున్నారు. మూసీ మత్స్యకారుల సంఘంలో 3,600 మంది సభ్యులు కొనసాగుతున్నారు. ఈ ప్రాజెక్టు పరివాహక గ్రామాలైన రత్నాపురం, ఇటుకులపాడు, ఓగోడు, ఓల్వాపురం, బొప్పారం, రామచంద్రపల్లె, ఎండ్లపల్లి, రామారం, రామచంద్రపురం, సోలిపేట, జాజిరెడ్డిగూడెంలలో మత్స్యకార సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో చేపల పెంపకం చేస్తున్నారు.

ఏంటీ ఈ కేజ్ కల్చర్..?

ప్రభుత్వం పంపిణీ చేసే చేపపిల్లలను చెరువులు, జలాశయాల్లో పోయడం పరిపాటి. కొందరు మత్స్యకారులు ప్రైవేటుగా ఇతర రాష్ట్రాల నుంచి పులస, రహు, బొచ్చె, బంగారుతీగె వంటి చేపపిల్లలు తెచ్చి పెంపకం చేస్తారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో కాలుష్యానికి ఈ రకమైన చేపపిల్లలు చనిపోతున్నాయి. వాటి ఎదుగుదల నిలిచిపోతుంది. దీంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులకు విన్నవించుకోగా ఈ నీటిని తట్టుకునే చేప పిల్లలను పంపిణీ చేసేలా కార్యాచరణ చేపట్టింది.

ప్రత్యేకంగా ఆఫ్రికా దేశంలో ఎక్కువగా వినియోగించే 'పంగాసీయస్ థిలాపీయా' అనే శాస్త్రీయ నామం ఉన్న చేపలను పెంచుతున్నారు. మత్స్యకారులు 'పంకాస్' చేపలుగా వీటిని పిలుస్తున్నారు. వీటికి సమృద్ధిగా మేత వేస్తే 120 రోజుల్లో ఒక్కో చేప కేజీన్నర వరకు పెరుగుతుంది. ఎలాంటి వాతావరణం ఉన్న నీటి నిల్వల్లోనూ ఇవి ఎదుగుతుండటంతో మత్స్యకారులు ఈ విధానంపై ఆసక్తి చూపిస్తున్నారు. 12 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో 10 యూనిట్‌లను కేజ్‌కల్చర్‌లో ఈ ప్రాజెక్టులో ఏర్పాటు చేశారు.

పంకాస్ చేపలతో ఆర్థికాభివృద్ధి..

- రావుల ఎల్లయ్య, మత్స్యకారుడు, రత్నాపురం

ప్రాజెక్టులో ప్రస్తుతం పంకాస్ చేపలను పెంచుతున్నాం. ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిన ఉచిత చేపలన్నీ ఇందులో పోసిన వెంటనే చనిపోయాయి. అధికారుల సహకారంతో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ఈ చేపలు తింటే ఎలాంటి ఇబ్బందులుండవు. ఆఫ్రికా, జపాన్, అమెరికా, చైనా దేశాల్లో ఈ రకం చేపలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విక్రయాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

- ఎం.చరిత, జిల్లా మత్స్యశాఖ అధికారి, నల్గొండ

మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అక్టోబరు నెలాఖరు నుంచి జూన్ వరకు ఈ కల్చర్ అనుకూలంగా ఉంటుంది. మూసీ పరివాహక మత్స్యకారుల సంఘ సభ్యులతో రూ.80 లక్షల వరకు ఖర్చుచేసి కేజ్‌కల్చర్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం. 90 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తోంది. ఇటీవలే 'పంగాసీయస్ థిలాపీయా' చేప పిల్లలను విడుదల చేశాం. ఇవి 120 రోజుల్లో కేజీ కంటే ఎక్కువ పరిమాణంలో పెరుగుతాయి.

# కాస్మొటిక్ కిట్లు రాలే!



జగిత్యాల : పేద కుటుంబాలకు చెందిన బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయి. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 లక్షల వరకు వెచ్చిస్తున్నా తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. అద్దె భవనాల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోగా కనీసం నిత్యావసరాల విషయంలో నిర్లక్ష్యంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

బాలురు 928... బాలికలు 771

జిల్లాలో 5 మైనారిటీ గురుకుల పాఠశాలలు, అనుబంధంగా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జగిత్యాలలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 349 మంది, జగిత్యాల బాలికల గురుకుల పాఠశాలలో 404 మంది, కోరుట్లలో 281, మెట్పల్లిలో 298, ధర్మపురిలో 367 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలురు 928 మంది, బాలికలు 771 మంది విద్యనభ్యసిస్తున్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి ప్రతి 3 నెలలకు ఒకసారి కాస్మొటిక్ కిట్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇందులో 2 దువ్వెనలు, 1 టూత్ బ్రష్, టూత్ పేస్టులు చిన్నవి 3, కొబ్బరి నూనె బాటిల్, ఫేస్ పౌడర్ చిన్నవి 3, స్నానపు సబ్బులు, బట్టల సబ్బు 1 ఉంటాయి. ప్రత్యేకంగా దోబీ గురుకులానికి వచ్చి దుస్తులు ఉతకడంతో ఒక సబ్బు 3 నెలలకు సరిపడుతుండగా, స్నానపు సబ్బు ఒక్కరికి 15 రోజులకు కూడా సరిపడటం లేదు. అయితే 3 నెలలకు ఒకసారి సరఫరా చేసే కాస్మొటిక్ కిట్లు ఏడాదిన్నర నుంచి రావడం లేదు. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో కిట్లు సరఫరా కాగా ఆ తరువాత నుంచి కాస్మొటిక్ కిట్ల ఊసే లేకుండా పోయింది.

మైదానాలు ఎక్కడ?

విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, ఆరోగ్యం, సోదరభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా మైనారిటీ గురుకుల పాఠశాలల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు సరఫరా చేస్తోంది. ఇందులో క్రీడా పరికరాలతో పాటు, బూట్లు, సాక్సులు, సమదుస్తులు అందచేస్తోంది. ప్రతి పాఠశాలలోనూ వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, అద్దె భవనాల్లో గురుకులాలు నిర్వహిస్తుండటంతో మైదానాలు మాత్రం అందుబాటులో లేవు. దీంతో సెలవు దినాల్లో మైదానానికి తీసుకెళ్లి ఆటలు ఆడించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వానికి నివేదించాం

డాక్టర్ రాజేందర్, ఆర్ఎల్‌సీ

కాస్మొటిక్ కిట్లు సరఫరా కాని విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్లు ఇప్పటికే సరఫరా కాగా విద్యార్థులకు పంపిణీ చేశాం. కాస్మొటిక్ కిట్లు, బాలికల అవసరాలకు సంబంధించినవి కూడా సరఫరా కాగానే విద్యార్థులకు అందచేస్తాం.

విద్యార్థినులకు ఇబ్బందులు

కాస్మొటిక్ కిట్లతో పాటు బాలికలకు ప్యాడ్లు సైతం సరఫరా చేయడం లేదు. దీంతో ప్రతి నెలా విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా అనారోగ్యం బారిన పడే అవకాశాలకు తావిస్తోంది. ప్రతి పాఠశాల, కళాశాలలో చదువుతున్న కిషోర బాలికలకు ప్యాడ్లు గతంలో క్రమం తప్పకుండా 3 నెలలకు ఒకసారి వచ్చేవి. ఇందులో ఒక్కో ప్యాకెట్లో 3 ప్యాడ్లు ఉంటుండగా, మూడు నెలలు సరిపోయేవి. ఈ ఏడాది ప్రత్యేకంగా చిత్రలేఖనం కోసం కిట్లు సరఫరా చేసిన ప్రభుత్వం, ప్యాడ్లు పంపిణీ చేయకపోవడం విస్మయం కలిగిస్తోంది.

# ఆలేరుకు.. ఇక అమృతమే..!

ఆలేరు : తాగునీటి సమస్యతో సతమతమవుతున్న నగరాలు, పట్టణాలపై కేంద్ర ప్రభుత్వం అమృత జల్లులు కురిపిస్తోంది. ఇందులో భాగంగా ఆలేరు పురపాలికకు అమృత్ 2.0 పథకంలో రూ.12 కోట్ల మంజూరయ్యాయి. పక్షం రోజుల కిందట పనులు మొదలయ్యాయి. ఐదు నెలల్లో పనులు పూర్తి కానున్నాయి. పనులు పూర్తయి వినియోగంలోకి వస్తే రాబోయే మూడు దశాబ్దాల పాటు తాగునీటి సమస్య ఉండదు. ఆలేరు పురపాలిక పరిధిలో 4,697 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. 22 ఓహెచ్ఎస్ఆర్, 5 జీఎస్ఎల్ఆర్ ట్యాంకులు ఉన్నాయి. నిత్యం నీటి డిమాండ్ 3.44 ఎల్ఎండీలు కాగా ఇందులో సగం మాత్రమే మిషన్ భగీరథ ద్వారా అందుతోంది. పురపాలికకు చెందిన 49 స్కీం బోర్లు, 6 అద్దెబోర్ల ద్వారా నిత్యం 1.6 ఎల్ఎండీలు సరఫరా అవుతోంది. పట్టణ విస్తరణ పెరుగుతుండటం, పరిసర ప్రాంతాల వారు ఆలేరులో స్థిర నివాసాలు ఏర్పరచుకోవడంతో జనాభా పెరుగుతోంది. ఈ క్రమంలో నీటి వినియోగం అధికమవుతోంది. అమృత్ 2.0 పథకంలో మంజూరైన రూ.12 కోట్ల నిధులతో చేపట్టనున్న పనులతో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభించనుంది.

అమృత్ 2.0 పథకంలో చేపడుతున్న పనులు



ఆలేరు పురపాలిక పరిధిని రెండు జోన్లుగా విభజించారు. జోన్-1 (రైల్వే ట్రాక్‌కు ఉత్తర దిశ)లో నూతనంగా 7లక్షల లీటర్లు, జోన్-2(రైల్వే ట్రాక్‌కు దక్షిణ దిశ)లో 10లక్షల లీటర్ల సామర్థ్యం ఈఎల్ఎస్ఆర్‌ను నిర్మిస్తున్నారు. ఈ రెండింటి నిర్మాణాలకు రూ.2.97 కోట్లు కేటాయించారు. ఇంటింటికి నీటి సరఫరా చేయడంలో పైపులైన్ల నిర్మాణాలకు రూ.1.63కోట్లు వెచ్చించనున్నారు. మరో ఏడు రకాల పనులకు సుమారు రూ.3.75 కోట్లు కేటాయించారు. సీనరేజ్, డీఎంఎఫ్, జీఎస్టీ, ఎన్ఏసీ తదితర చెల్లింపులకు రూ.2.74 కోట్లు, ఐదు సంవత్సరాల పాటు నీటి పథకాల నిర్వహణకు నూ.87లక్షలు కేటాయించారు.

# రొమ్ము రుగ్మత.. ఏదీ సన్నద్ధత

ఖమ్మం : ఏటా అక్టోబరు మాసంలో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం నిర్వహిస్తారు. మహిళల్లో పెరుగుతున్న బ్రెస్ట్ క్యాన్సర్‌పై జిల్లావ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ రుగ్మతను ముందస్తుగా గుర్తించడం ఎలా, ఏయే వైద్య పరీక్షలు ఉన్నాయి, వాటి ప్రాధాన్యం, సొంతంగా ఎలా పరీక్షించుకోవచ్చు వంటి విషయాలపై మహిళల్లో అవగాహన పెంచాలి. నెలాఖరు వచ్చినా జిల్లాలో ఇటువంటి కార్యక్రమాలు జరిగిన జాడ లేదు.

ప్రధాన సమస్యలు ఇవీ...మహిళల్లో వివిధ రకాల రొమ్ము రుగ్మతలు బయట పడుతున్నాయి. సాధారణ లక్షణాలతో ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తున్నాయి. చాలా రకాలు ఉన్నప్పటికీ బ్రెస్ట్ క్యాన్సర్, సిస్టులా, ఇన్‌ఫెక్షన్లు, గడ్డలు ప్రధానమైనవి. ఆయా సమస్యల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలో ఈ సమస్య అధికంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పట్టణ, పల్లె ప్రాంతాల్లో కేసులు విస్తరిస్తున్నాయి. జిల్లాలోనూ ఏటా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ముందస్తు స్క్రీనింగ్‌తో వ్యాధి ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది. ఏటా ఆరోగ్య శాఖ అక్టోబరును బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసంగా ప్రకటించి కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపకపోవడంతో ప్రజల్లో అవగాహన కొరవడింది.

కొరవడిన ప్రణాళిక అక్టోబరు చివరి వారం వచ్చినా ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. ఈ మాసంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై చర్చించడం, రక్త నమూనాలు సేకరించడం, మామోగ్రామ్ పరీక్షలు చేయడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం, ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు నిర్వహించడం, వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం కల్పించడం వంటివి చేయాలి. జిల్లాలో బోధనాసుపత్రి, ఏడు సీహెచ్‌సీలు, 30 పీహెచ్‌సీలు, 161 పల్లె దవాఖాలు ఉన్నాయి. తొమ్మిది బస్తీ దవాఖానాలు, ఆరవైఆరు ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నప్పటికీ కార్యక్రమాల నిర్వహణ నామమాత్రంగానూ జరగలేదు. ఈనెల 22న అవగాహనకు ప్రతీకగా పింక్ రిబ్బన్ డే నిర్వహించాల్సి ఉండగా ఎక్కడ కార్యక్రమాలు చేయలేదు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుబ్బారావును వివరణ కోరగా ఆరోగ్యశాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని, స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో నిర్వహించాలని ఇటీవలే నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని ఆస్పత్రుల్లో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

# ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలు

సంగారెడ్డి : పెట్రో, డీజిల్ ధరలు తరచూ పెరుగుతున్నాయి. వాహనదారులకు ఇది భారంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి కనబర్చుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వాహనాలు కొనుగోలు చేస్తున్న పలువురు ఇంటి వద్ద ఛార్జింగ్ చేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో ఆ ఇబ్బందులు తీరనున్నాయి. టీఎస్‌రెడ్‌కో (తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తుండటమే దీనికి కారణం.

ప్రభుత్వ స్థలాలకు ప్రాధాన్యం: టీఎస్‌రెడ్‌కో ఆధ్వర్యంలో ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలను జిల్లాల్లో అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఛార్జింగ్ స్టేషన్లకు ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి చేశారు. జాతీయ, ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో స్థాపించనున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాలు, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, పంచాయతీరాజ్, సహకార, సంక్షేమ శాఖల సహకారంతో ఆయా శాఖల పరిధిలో స్థలాలను గుర్తిస్తున్నారు. జిల్లాలో ఆర్అండ్‌బీకి చెందిన ఏడు స్థలాలను ఇప్పటికే ఖరారు చేశారు. కోహీర్‌లోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలోనూ ఏర్పాటుకు నిర్ణయించారు. హోటళ్లు, దాబాల నిర్వాహకులు ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు.

స్థల యజమానులకు ఆదాయం

ఛార్జింగ్ కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంలో స్థలాలకు సంబంధించిన శాఖలు లేదా యజమానులకు కొంత మేర చెల్లించనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూపాయి చొప్పున చెల్లించనున్నారు. రాబోయే మూడు నెలల్లో కేంద్రాలు అందుబాటులోకి తెచ్చేందుకు సంబంధిత విభాగం అధికారులు ప్రయత్నిస్తున్నారు. ద్విచక్ర వాహనాల్లో 3 నుంచి 4 యూనిట్లు, కారులో 75 యూనిట్ల వరకు ఛార్జింగ్ చేసే అవకాశం ఉండనుంది. బ్యాటరీ సామర్థ్యం ఆధారంగా అరగంట నుంచి గంటలోపు ఛార్జింగ్ చేయనున్నారు. ఆయా చోట్ల అనుమతులు పూర్తయితే 30 కిలోవాట్స్, 60 కిలోవాట్స్ సామర్థ్యంతో కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

త్వరలో వినియోగంలోకి వచ్చేలా..

రాబోయే రోజుల్లో విద్యుత్తు వాహనాలు భారీగా పెరగనున్నాయి. ఇందుకు అనుగుణంగా ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేస్తాం. ఈ-వాహన ఛార్జింగ్ కేంద్రాలు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.మాణిక్యం, టీఎస్ రెడ్‌కో జిల్లా మేనేజర్

# ఇక కల్యాణ వైభోగమే!

వికారాబాద్ : దీపావళి పండగ ముగియగానే పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుంది. ఇందుకు వివాహ వేడుక వేదికలు సిద్ధమవుతున్నాయి. మూడు నెలలుగా మూడాలు శుభకార్యాలకు అడ్డంకిగా ఉన్నాయి. ఇక ఇప్పటి నుంచి మొదలై రెండు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో నిర్వాహకులు ఇప్పటి నుంచే మంచి ముహూర్తం నిర్ణయించుకునేందుకు పురోహితులను ఆశ్రయిస్తున్నారు. రెండు నెలల పాటు వాయిద్యాలు, మండపాలు, క్యాటరింగ్ నిర్వాహకులకు చేతి నిండా పనులు దొరకనున్నాయి. అడ్వాన్సు చెల్లించి ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు.

వసతులను బట్టి..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సుమారు వెయ్యికి పైగా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వసతులను బట్టి ఒక్క రోజు అద్దె రూ.70 వేల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుండటంతో వాటి ధరలు అమాంతం పెంచేశారు. దీపావళి కూడా కావడంతో వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా ఉన్నాయి. ఇదే ఒరవడి రెండు నెలల పాటు ఉండనుంది. నాలుగు జిల్లాల్లోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, వికారాబాద్, తాండూరుల్లోని దుకాణాల్లో రద్దీ పెరగనుంది. దీనికితోడు ఇక్కడినుంచి మరికొందరు హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయనున్నారు.

# హోదాతో మహేశ్వరానికి మహర్దశ

మహేశ్వరం : నియోజకవర్గ కేంద్రమైన మహేశ్వరాన్ని పురపాలికగా మార్చే అంశంపై పట్టన ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పురపాలికగా హోదా పెరుగుతుండడంతో దీని రూపురేఖలు, పాలన తీరుతెన్నులు ఎలా మారబోతున్నాయనేది చర్చనీయాంశమైంది. పంచాయతీల కాలపరిమితి ఫిబ్రవరి1 తో ముగిసిన నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 2 నుంచి మున్సిపాలిటీగా మార్చేందుకు అభ్యంతరం లేదని 12 గ్రామపంచాయతీలకు చెందిన పలువురు ఇప్పటికే రాత పూర్వకంగా ఇచ్చారు.

కలిసేవి ఇవే..మహేశ్వరం, తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్, సిరిగిరిపురం, గంగారం, కేసీతండా, ఎన్‌డీతండా, మన్‌సాన్‌పల్లి, ఉప్పుగడ్డతండా, రాంచంద్రగూడ, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి గ్రామపంచా యతీలు కలిపి మున్సిపాలిటీగా మార్చనున్నారు.

39,693 మంది జనాభాతో..

మున్సిపాలిటీగా మార్చేందుకు 22 వేల జనాభా ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఈ పన్నెండు పంచాయతీల్లో కలిపి 39,693 మంది జనాభా ఉంది. ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ప్రతి విభాగానికి ఓ ఇంజనీరి



ంగ్ అధికారి, సిబ్బంది ఉంటారు. నిధులు కూడా ప్రభుత్వం నుంచి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. ఏ సమస్య వచ్చినా అధికారులు అందుబాటులో ఉంటారు. ఆహ్లాదం కోసం పార్కులు, ఇతర సౌకర్యాల కల్పనకు అవకాశం ఉంటుంది.

ఆసక్తికర అంశాలు ఇవే..!

ప్రతిపాదిత గ్రామాలు అభివృద్ధిలో ముందున్నాయి. ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం ఎక్కువ.వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ వర్గాల వారు నగరంతో పోటీపడే ఖరీదైన భవనాలు నిర్మించుకున్నారు.వ్యవసాయం, పరిశ్రమలు, వ్యాపారాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలూ అధికమే. మహేశ్వరంలో శ్రీశివగంగ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రం, గడికోట, కోనేరు ఉన్నాయి.


# ఈ వారం.. సాగునీటికి తిప్పలే..!

హుజూర్‌నగర్: భారీ వర్షాలకు పడిన గండ్లు రైతులకు కడగండ్లే మిగిల్చాయి. గండ్లు పూడ్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఇప్పటికే 19 రోజుల నుంచి నీరు లేక నాటు వేసిన పొలాలు నెర్రెలు ఇచ్చాయి. నెల క్రితం నాటు వేసిన పొలాలు కొంత మేరకు బాగానే ఉన్నాయి. ప్రస్తుత నీటి ఎద్దడిని అవి తట్టుకునే స్థాయిలో ఉన్నాయి. కానీ ఇటీవలే నాటు వేసిన పొలాలు మాత్రం ఎండు ముఖం పట్టాయి. ఎంబీ కెనాల్ పరిధిలో... ఎంబీ కెనాల్ పరిధిలో దాదాపు 1.25 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఎక్కువ మంది రైతులు బోర్లు, బావులు తీసుకోవడం వల్ల ప్రస్తుతం నీరు రాకపోయినా పంటలను రక్షించుకుంటున్నారు. అవి లేకుండా కేవలం కాలువ నీటిపైనే ఆధారపడ్డ రైతుల పంటలు ఎండుముఖం పట్టాయి. త్వరితగతిన గండి పూడ్చివేత పనులు పూర్తి చేసి నీరు విడుదల చేయకపోతే రైతులు నాటు వేసిన పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఎడమ కాలువకు పడిన గండి పూడ్చి వేత పనులు జరిగే వరకు ఆగకుండా అవకాశం ఉన్న మేరకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కేవలం కాలువ నీటిపైనే ఆధారపడి సాగు చేసిన విస్తీర్ణం దాదాపు 40వేల ఎకరాల పైచిలుకు ఉంటుందని చెబుతున్నారు. అందులో ఆలస్యంగా నాట్లు వేసిన రైతులకు దాదాపు 30వేల ఎకరాల వరకు ఉంటుందని అంచనా.

అన్నింటికీ అడ్డంకిగానే... ముందస్తుగా నాటు వేసిన వాటికి నీరు లేక కలుపు తీసే, యూరియా వేసుకునే పరిస్థితి లేదు. దీనివల్ల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ఆలస్యంగా నాటు వేసిన వాటికి నీరందితేనే ఊపిరి పోసుకుంటాయి. ఇంకా నాటు వేయని వారు ఇక ఈ సీజన్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనని అంటున్నారు. అధికారులు మాత్రం మరో రెండు, మూడు రోజుల్లో నీరు విడుదల చేస్తామని చెబుతున్నారు.

# ఆగ్రోస్ లక్ష్యం.. నిర్లక్ష్యం!

నల్గొండ : రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించాలనేదే తెలంగాణ ఆగ్రోస్ సంస్థ లక్ష్యం. పంటలకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు తీసుకొచ్చి వాటి పనితీరు, ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించడానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించి నల్గొండ ఆగ్రోస్ కార్యాలయంలో రూ.40 లక్షల వ్యయంతో 2017లో ప్రదర్శన కేంద్రం నిర్మించారు. సలహాల కోసం సమావేశం భవనాన్ని ఏర్పాటు చేశారు. కానీ.. ఆరేళ్లుగా దీనిని ప్రారంభించలేదు. భవనాలు నిరుపయోగంగా ఉండటంతో పరిసరాల్లో పిచ్చి మొక్కలు మొలిచాయి.



అందుబాటులోకి వస్తే..ఆగ్రోస్ పరికరాల ప్రదర్శన కేంద్రం అందుబాటులోకి వస్తే రైతులకు అవసరమైన విత్తే యంత్రం, కలుపు నివారణ పరికరాలు, కోత యంత్రాలు, అంత్‌ర్‌కృషి పరికరాలు వాటి పనితీరుతో పాటు ప్రయోజనాలు వివరించే అవకాశం ఉంటుంది. తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం పొందడంలో రైతులకు చేయూతనివ్వడానికి సరసమైన ధరలకు అందుతాయని అధికారులు అప్పట్లో వెల్లడించారు. పరికరాల పనితీరును చూపించడంతో పాటు వాటిపై అవగాహన కల్పించాల్సి ఉంది. ఆ ఉద్దేశ్యంతోనే అప్పట్లో నల్గొండలోని ఆగ్రోస్‌కు చెందిన 2.20 ఎకరాల్లో భారాస కార్యాలయంతో పాటు, పెట్రోల్ బంక్ నిర్మించారు. మిగిలిన ఎకరం స్థలంలో ఈ కేంద్రాన్ని నిర్మించారు. ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేయవడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోయింది.

ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి..

వ్యవసాయ పరికరాల కేంద్రాన్ని, సమావేశం భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే నిర్ణయం ఉన్నతాధికారులదే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. రైతుల ప్రయోజనం కోసమే దీనిని నిర్మించాం. ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. వెంకన్న, ఆగ్రోస్ రీజనల్ మేనేజర్, ఖమ్మం

# కోసేస్తున్నారు!



వికారాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం రకరకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులో శస్త్రచికిత్సలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇందుకు అధికారుల పర్యవేక్షణ లోపం ఒక కారణమైతే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో జాప్యం చోటుచేసుకోవడం మరో కారణంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో కాన్పుల తీరుపై కథనం.

**18 నెలలుగా కిట్లు, నగదు మాటే లేదు**

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని స్త్రీ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవిస్తే 42 వస్తువులున్న కిట్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. దీనిని మాతా, శిశు ఆరోగ్య కిట్‌గా పేరు మార్చారు. మగపిల్లవాడు పుడితే రూ.12 వేలు, ఆడపిల్ల పుడితే రూ.13 వేలు చెల్లిస్తారు. ఏడాదిన్నర క్రితం నుంచి కిట్‌తో పాటు నగదు పారితోషికాన్ని 8,000 మంది బాలింతలకు చెల్లించలేదు.

ఇవీ ప్రధాన కారణాలు

ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణ లోపం

కిట్లు, మందుల మంజూరులో జాప్యం

సిబ్బంది చేతివాటం

పారిశుద్ధ్య లోపం.. తదితరాలు..

కాన్పు చేస్తే రూ.30,000 నుంచి రూ.లక్ష వసూలు

జిల్లాలో అధికశాతం పేదలు, రైతు కుటుంబాలే ఎక్కువ. కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కింది స్థాయి సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినా..'ప్రైవేటులో తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఇక్కడ ఎవరూ పట్టించుకోరని' ప్రైవేటుకు వెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు, మందులు అన్నీ ఉచితమైనా నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో అధిక శాతం గర్భిణులు తలకు మించిన ఖర్చులు భరిస్తూ తప్పనిసరై ప్రైవేటు వైపు మొగ్గుచూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొన్ని యాజమాన్యాలు సాధారణ కాన్పు అయ్యే వీలున్నా శస్త్ర చికిత్సలే మేలని నచ్చజెపుతున్నారు. కాన్పుకు రూ.30,000 నుంచి రూ.లక్ష వరకు బిల్లును చేతిలో పెడుతున్నారు.

ఆశా, ఏఎన్ఎంల నిరంతర పర్యవేక్షణ

– డాక్టర్ పల్వన్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, వికారాబాద్.

జిల్లాలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నాం. శస్త్ర చికిత్సలు మంచిది కాదని మహిళలకు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో, పట్టణాల్లో గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవం వరకు అన్ని తానై ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తున్నారు. గర్భిణులను సర్కార్ దవాఖానాకు తీసుకెళతారు. వైద్యుడి వద్ద పరీక్షలు చేయిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం అయ్యే విధంగా చూస్తున్నారు.

# పురపాలికలకు మహర్దశ




తాండూరు : 'అర్బన్ తెలంగాణ..అభివృద్ధి నమూనా'లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యం లభించబోతోంది. వచ్చే మార్చి కల్లా ఇందుకు సంబంధించి 'మాస్టర్ ప్లాన్–2050' తయారు కానుంది. రానున్న 26 సంవత్సరాల్లో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని రూపొందించబోతున్నారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలు ఈ ప్రక్రియలో భాగం కానున్నాయి. మున్సిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది.

ఎన్నో ప్రయోజనాలు..


మాస్టర్ ప్లాన్–20250తో జిల్లాలోని మున్సిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒన గూరతాయని అధికారులు వివరిస్తున్నారు. బ్లూ–గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు కలిపి 2024–26 సంవత్సరాల్లో రూ.13,700 కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి.

**కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రాధాన్యం**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోకెల్లా తాండూరు మున్సిపాలిటీ చాలా పెద్దది. పైగా వ్యాపార, వాణిజ్య కేంద్రం. నాపరాయి, సుద్ద లేటరైట్, సిమెంటు రవాణా, ఇతరత్రా ముడిసరకు రవాణాకు సంబంధించిన లారీలు నిత్యం వేలల్లో రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికి తోడు ఆటోలు, కార్లు, చిన్న లారీలు, ద్విచక్ర వాహనాలు వేలల్లోనే ఉన్నాయి. వచ్చి పోయే వాహనాల కారణంగా ప్రాణవాయువు కాలుష్యకారకంగా మారుతోంది. సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.78 కోట్ల వ్యయంతో పట్టణ శివారు నుంచి 12 కిలో మీటర్ల పొడవునా రెండు వరుసలతో కూడిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2017లోనే శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. కొలిక్కి వస్తే లారీలు బయటి నుంచే వెళతాయి కాబట్టి కాలుష్యం తగ్గుతుంది. అయితే ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి కాబట్టి కాలుష్యం ఇంకా ఉండనే ఉంటుంది. దీన్ని కూడా పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం విద్యుత్తు వాహనాలను ప్రోత్సహించ నుంది. ఇదంతా గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) పేరుతో మిగిలిన మున్సిపాలిటీలకు కూడా వర్తింపజేస్తారు.

**కూడళ్లలో పైవంతెనల నిర్మాణం**తాండూరులోని శివాజీ, ఇందిర, అంబేడ్కర్, విలియమ్ మూన్ కూడళ్ల మీదుగా వచ్చి పోయే వాహనాల రద్దీ ఎక్కువ.వికారాబాద్‌లో ఎన్టీఆర్, బీజేఆర్, ఎంఆర్ పెంటయ్య, మహాశక్తి కూడలిలో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి.కొడంగల్‌లో అంబేద్కర్ ప్రధాన కూడలి.పరిగిలో గంజ్, కొడంగల్ కూడళ్లు రద్దీతో ఉంటాయి. భవిష్యత్తులో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తకుండా ఇలాంటి చోట్ల పైవంతెనల నిర్మాణం చేపడతారు.

# నష్టాల ముంగిట పత్తి



కోదాడ: ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు పత్తి పంటలో పది రోజుల పాటు నీరు నిల్వ ఉంది. పత్తి చేనులో నీరు నిలిచి అధిక పదును ఉండటంతో మొక్కకు ఉన్న గూడ, పూత రాలిపోయింది. నీళ్లు నిల్వ ఉన్న చోట పత్తి మొక్క మొదలు ఎండిపోతోంది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు.

భారీ వర్షాలకు తీరని నష్టం..భారీ వర్షాలు పడటంతో పత్తి మొక్కలు ఒరిగిపోయాయి. వరదకు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో కొన్నిచోట్ల మొక్కలు చనిపోయాయి. పది రోజుల పాటు నిత్యం వర్షం పడటంతో గడ్డి విపరీతంగా పెరిగింది. దీంతో తెల్ల దోమ, పచ్చ దోమ, పురుగు ఉండటంతో చేనును రక్షించేందుకు విపరీతంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండు సార్లు దుక్కిమందు, యూరియా వేయడంతో పాటు పిచికారీ చేశారు. గడ్డిని తొలగించేందుకు అధిక ఖర్చు వచ్చింది. ఒక్కో ఎకరానికి అన్ని ఖర్చులు కలుపుకొని రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. విపరీతంగా గూడ, పూత రాలడంతో ఎకరానికి దిగుబడి అమాంతం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను

మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. దుక్కి దున్నినందుకు, విత్తనాలు, దుక్కి మందు, యూరియా చల్లడం, పిచికారీ మందులు ఇలా అన్ని ఖర్చులు కలిపి ఇప్పటికే రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తి పంట పూత, పిందె రాలిపోయింది. ఈ ఏడాది పత్తి దిగుబడి వచ్చే అవకాశం లేదు.

సైదులు, రైతు, తాడువాయి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పది రోజుల పాటు భారీ వర్షాలు పడటంతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. రైతులు లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా చర్యలు చేపట్టాలి. గూడ, పూత, పిందె దశలో అధిక పదును ఉండటంతో అవి రాలిపోతున్నాయి. రైతులు ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేయాలి. సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లుతుంది.

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

# అమృతం తాగరేం..!

మునగాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 17 పురపాలికలకు ఈ పథకం కింద భారీగా నిధులు మంజూరు చేశారు. ఈ పథకం కింద చేపట్టే పనులకు 2023 సెప్టెంబరులోనే పరిపాలనా అనుమతులు లభించాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఒకే సంస్థకు పనులు అప్పగించారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. టెండర్లు ఖరారై చాలా కాలం అవుతున్నా కొన్ని పురపాలికల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. సూర్యాపేట, నేరేడుచర్ల, చిట్యాల పురపాలికల్లో పనులు ప్రారంభించాల్సి ఉంది. పనులు ప్రారంభించిన పురపాలికల్లో నల్గొండలో మాత్రమే వేగవంతం అయ్యాయి. చాలా పురపాలికల్లో పనులు ఇంకా వేగం పుంజుకోలేదు. ఈ పనులు పూర్తి చేయడానికి రెండేళ్ల కాలపరిమితి ఉంది. పనులు ప్రారంభమైన చోట్ల చురుకుగా జరిగేలా, పనులు ప్రారంభం కాని చోట్ల వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.



ట్యాంకుల నిర్మాణానికి స్థలాల గుర్తింపు..

నేరేడుచర్ల పట్టణాన్ని మూడు జోన్లుగా గుర్తించారు. రెండు చోట్ల 300 కె.ఎల్, ఒక చోట 600 కె.ఎల్ సామర్థ్యం గల ట్యాంకులు నిర్మించనున్నారు. శివాలయం రోడ్డులో, తహసీల్దార్ కార్యాలయం వద్ద గల వెంచర్‌లో, పద్మావతినగర్‌లో గల ప్రభుత్వ స్థలాలలో వీటిని నిర్మించేందుకు ఏర్పాట్లు చేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఎన్నికల వల్ల ఆలస్యంఅమృత్ 2.0 పథకం పనులు ఎన్నికల వల్ల ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం 14 పురపాలికల్లో ప్రారంభమయ్యాయి. మిగిలిన మూడు పురపాలికలు సూర్యాపేట, నేరేడుచర్ల, చిట్యాలలో త్వరలో ప్రారంభమవుతాయి. ఇప్పటి వరకు గుత్తేదారుకు ఎలాంటి చెల్లింపులు జరపలేదు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. హుజూర్‌నగర్, దేవరకొండ పురపాలికలకు ఇందులో నిధుల కేటాయింపు లేదు.

సత్యనారాయణ, ఈఈ, ప్రజారోగ్యశాఖ, సూర్యాపేట

# వసతులు కల్పించి.. ఆసక్తి పెంచి

పెద్దపల్లి : పాఠశాల నుంచి ఇంటికి చేరుకోగానే చాలా మంది పిల్లలు టీవీలు, స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పుస్తక పఠనంతో విజ్ఞానం వికసించేలా 'రీడింగ్, లర్నింగ్ కార్నర్' కార్యక్రమాన్ని రూపొందించారు. ఇంటివద్ద ప్రశాంత వాతావరణం కల్పించి వారిలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**అమలు విధానం ఇదీ**

పిల్లల్లో పఠనాసక్తి, వ్యక్తిత్వ వికాసం మెరుగుపరిచేందుకు నీతి, బొమ్మల కథల పుస్తకాలు అందజేస్తున్నారు.

వారంలో రెండు రోజులకోసారి పుస్తకాలు ఇంటికి తీసుకెళ్తున్నారు. హోంవర్క్‌తో పాటు ఈ పుస్తకాలను పఠించేలా ఆసక్తి కలిగిస్తున్నారు. ఇంటికి చేరుకోగానే పుస్తక పఠనం చేసేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహిస్తున్నారు.

కొందరు ఉపాధ్యాయులు పాఠశాలల్లో పిల్లల విజ్ఞానాన్ని పరీక్షిస్తున్నారు. వికసిస్తున్న విజ్ఞానంరీడింగ్, లర్నింగ్ కార్నర్ కార్యక్రమంతో చిన్నారుల్లో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతోంది. నీతికథలు, బొమ్మలకథల పుస్తకాలకు ఆకర్షితులవుతున్నారు. చదువుకోవడం, రాసుకునేందుకు అనువుగా ఉండేలా వాతావరణాన్ని కల్పిస్తున్నారు. పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి. వీటితో పాటు ఉపాధ్యాయులు ఇచ్చిన ఇంటి పని(హోంవర్క్)ని పూర్తి చేస్తున్నారు.

**ఏకాగ్రతతో చదువుతున్నా**

నేను బిట్టుపల్లి నుంచి పాఠశాలకు వస్తున్నా. ఇంటి వద్ద నా కోసం వసతులు కల్పించారు. బొమ్మలు, నీతి కథల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్తున్నా. హోంవర్క్ పూర్తి చేసిన వెంటనే నీతికథలు చదువుతున్నా. ఉపాధ్యాయులు నిత్యం ఎన్నో విషయాలను చెబుతున్నారు.

హర్షవర్ధన్, 4వ తరగతి, ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాల

**ఎంతో ఆసక్తిగా ఉంది**

మా ఇంటి వద్ద చదువుకునేందుకు తల్లిదండ్రులు మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లగానే ముందుగా రోజువారి పనులను పూర్తి చేసుకుంటున్నా. నీతికథలు, బొమ్మలు, ఇతర పుస్తకాలను చదువుతున్నా. నిత్యం పుస్తకాలను చదువుతుండటంతో ఆసక్తి పెరుగుతోంది.

రూపాదేవి, 7వ తరగతి, కాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, జూలపల్లిపకడ్బందీగా అమలు చేస్తున్నాం

జిల్లాలో రీడింగ్, లర్నింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఇందుకోసం పాఠశాలలకు కథలు, బొమ్మలు, నీతి పుస్తకాలు పంపిణీ చేశాం. పిల్లలు ఇంటి వద్దకు తీసుకెళ్లి చదువుతూ పఠనాసక్తిని పెంచుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి. వారికి అనువైన వాతావరణాన్ని కల్పించాలి.

పీఎం షేక్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త




## సీఎం చంద్రబాబును కలిసిన కపిల్‌దేవ్.. గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుపై చర్చ

అమరావతి: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్.. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో గోల్ఫ్ కోర్స్ ఏర్పాటుపై చర్చించారు. సమావేశం అనంతరం కపిల్ దేవ్ మీడియాతో మాట్లాడారు.

"క్రీడలపై సీఎం చాలా ఆసక్తిగా ఉన్నారు. గోల్ఫ్ గురించి ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఇండియన్ గోల్ఫ్‌కు అధ్యక్షుడిగా ఉన్నా. ఎక్కడ భూమి ఇస్తారనేది ప్రభుత్వానిదే నిర్ణయం. స్పోర్ట్స్ సిటీ ఇస్తే చాలా సంతోషిస్తా" అని కపిల్ దేవ్ తెలిపారు. అనంతపురం, అమరావతి, విశాఖలో గోల్ఫ్‌కోర్సులు పెడతామని కేశినేని చిన్ని తెలిపారు. "ఏపీ అంబాసిడర్‌గా ఉండాలని కపిల్‌దేవ్‌ను కోరాం. రాష్ట్రంలో గోల్ఫ్ అభివృద్ధి చేయాలనే యోచనలో ఉన్నాం.

గోల్ఫ్ డ్రైవింగ్‌కు రేంజ్‌లు సిద్ధం చేస్తాం. తదుపరి సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకుంటాం. ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా ఆడేలా చేస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడాకారులను వెలికి తీస్తాం" అని తెలిపారు.

## జరగకూడనివన్నీ నా కళ్ల ముందే జరుగుతున్నాయి: వైఎస్ విజయమ్మ



వైకాపా అధినేత జగన్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య ఆస్తి పంపకాల వివాదం నేపథ్యంలో వారి తల్లి వైఎస్ విజయమ్మ స్పందించారు. ఈ మేరకు వైఎస్ఆర్ అభిమానులకు బహిరంగ లేఖ రాశారు. "జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే చాలా బాధేస్తోంది. జరగకూడనివన్నీ నా కళ్ల ముందే జరిగిపోతున్నాయి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారు. అబద్ధాల పరంపర కంటిన్యూ కాకూడదు. ఈ ఘటనలు నా పిల్లలిద్దరికే కాదు.. రాష్ట్రానికీ మంచిది కాదు" అని విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

## గంజాయిపై చంద్రబాబు సర్కార్ ఉక్కుపాదం..

అనకాపల్లి: జిల్లాలో పోలీసులు భారీ ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వి.మాడుగుల, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో 448 కేజీల గంజాయి, రెండు కేజీల లిక్విడ్ గంజాయిని జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రెండు వేర్వేరు ఘటనల్లో గంజాయి రవాణా చేస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి ఓ లారీ, బొలెరో వాహనం, కారు, ద్విచక్రవాహనం, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడిన మత్తుపదార్థాల విలువ రూ.21లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి తుని మీదుగా కేరళ రాష్ట్రానికి గంజాయి సరఫరా చేస్తున్నారన్న పక్కా సమచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు బృందాలుగా ఏర్పడి వి.మాడుగుల, కొత్తకోట సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఐదుగురు కేరళ రాష్ట్రానికి చెందిన వారి కాగా, ఒకరు చింతపల్లి వాసిగా పోలీసులు గుర్తించారు.

నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని, దర్యాప్తు చేసి ఈ కేసుతో సంబంధం ఉన్న మిగతా వారినీ అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అయితే ఇటీవల అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో ఏపీ గంజాయికి హబ్‌గా మారింది. దేశంలో ఏ ప్రాంతంలో గంజాయి పట్టుపడినా దాని మూలాలు మాత్రం ఏపీలో



తేలేవి. వైసీపీ నేతలే గంజాయి పండించి, సరఫరా చేస్తున్నారని కూటమి నేతలు అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు చేశారు. యువతను మద్యం, గంజాయికి బానిసలుగా మార్చేశారని ధ్వజమెత్తారు. అయితే ఎన్నికల ప్రచార సమయంలో ఏపీలో మత్తుపదార్థాలు సమూలంగా లేకుండా చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దాని దిశగా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా గంజాయి పండించినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గంజాయి సరఫరా దారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. చిన్న అనుమానం వచ్చినా దాడులు చేస్తూ అక్రమార్కుల గుండెల్లో నిద్రపోతున్నారు.

## సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆ పథకాన్ని అమలు చేస్తున్నాం.. మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు

విజయవాడ: పేదలంతా పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇవాళ(మంగళవారం) జరిగిన కార్యక్రమంలో అవార్డులను పురపాలక శాఖ మంత్రి నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... పీఎమ్ స్వనిధి పథకం సమర్థంగా అమలు చేసినందుకు జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి నారాయణ వివరించారు. 38 మంది అధికారులకు పీఎం స్వనిధి ప్రైస్ అవార్డులను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. పలు మున్సిపాల్టీల కమిషనర్లు, బ్యాంకు అధికారులకు అవార్డులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. పీఎం స్వనిధి పథకం ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించి వారి అభివృద్ధికి కృషి చేసినందుకు అవార్డులు అందజేసిందని మంత్రి నారాయణ వివరించారు. ఈ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుని పేదరికం నుంచి బయటపడిన లబ్ధిదారులను మంత్రి నారాయణ సన్మానించారు. పేదల ఆదాయం రెండింతలు చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో పీఎం స్వనిధి పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి నారాయణ ఉద్ఘాటించారు. పీఎం స్వనిధి పథకం కింద తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే లక్షల్లో రుణాలు పొందవచ్చని మంత్రి నారాయణ తెలిపారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు రుణాలపై కేంద్ర ప్రభుత్వం 7శాతం వడ్డీ రాయితీ ఇస్తుందని అన్నారు. కేవలం 4.5శాతం వడ్డీ మాత్రమే లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందని తెలిపారు. పీఎం స్వనిధి పథకం కింద 5లక్షల 48వేల 957..



దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వచ్చిన దరఖాస్తుల్లో 5 లక్షల 2వేల 894 మంది పేదలకు రుణాలిచ్చారని గుర్తుచేశారు. పీఎం స్వనిధి అమల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, బ్యాంకర్లకు మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. అవార్డులు గెలిచిన గుంటూరు, పుత్తూరు, రాయచోటి మేజర్ మున్సిపాలిటీ కమిషనర్లకు అభినందనలు తెలిపారు. అత్యుత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించిన పలు మైనర్ మున్సిపాలిటీ కమిషనర్లు, బ్యాంకర్లకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో ఉన్న పొదుపు మహిళలు వ్యాపారాలు చేస్తే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. పేద మహిళలు లక్షాధికారులు కావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు.

## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

విశాఖపట్నం: తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ప్రధాని మోదీ రెండేళ్ల క్రితం రోజ్‌గార్



మేళా ప్రారంభించారు. పది లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. రెండేళ్లలో 8 లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. విశాఖపట్నంలో ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది మోదీ ప్రభుత్వమే" అని బండి సంజయ్ అన్నారు.

## కుటుంబ సమస్యను తెదేపాకు అంటగడతారా?

తిరుమల: ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు మంచి ప్రణాళికతో పునర్నిర్మిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం



ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. షర్మిల కుటుంబ సమస్యను తెదేపాకు అంటగట్టడం బాధాకరమని.. వైకాపా అబద్ధాలు చెప్పి నిజాలు చేయాలని చూస్తోందన్నారు. కుటుంబ సమస్యను బహిర్గతం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.




నిషేధిత మాదక ద్రవ్యం మెథాంపెటమైన్(మెథ్) తయారీ ల్యాబ్‌ను ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎన్‌సీబీ అధికారులు గుర్తించారు. దీని నిర్వహణ వెనుక ఏకంగా తిహాడ్ జైలు వార్డెన్ హస్తం కూడా ఉందని తెలుసుకొని నిర్ఘాంతపోయారు. అక్టోబర్ 25వ తేదీన గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్‌సీబీ దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో నిర్వహిస్తున్న మెథ్ ల్యాబ్‌ను గుర్తించింది.

దీనిని తిహాడ్ జైలు వార్డెన్, ఢిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్త, ముంబయికి చెందిన కెమిస్ట్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ దేశీయ వినియోగానికి, అంతర్జాతీయ ఎగుమతుల కోసం సింథటిక్ డ్రగ్స్‌ను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్‌ను వారు స్వాధీనం చేసుకొన్నారు. ఈ ఫ్యాక్టరీ ఆవరణలో ఎసిటోన్, సోడియం హైడ్రాక్సైడ్, మిథాలిన్ క్లోరైడ్, ప్రీమియం గ్రేడ్ ఎథనాల్, రెడ్ పాస్ఫరస్, ఈథైల్ ఎసిటేట్ వంటివి లభించాయి. తయారీ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న పరికరాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పట్టుబడిన వ్యాపారవేత్తను గతంలో కూడా ఒక ఎన్డీపీఎస్ కేసులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది. ఆ సమయంలో అతడిని తిహాడ్ జైల్లో ఉంచగా.. అక్కడ వార్డెన్‌తో పరిచయం పెంచుకొని అతడిని కూడా ఈ మత్తు వ్యాపారంలోకి దించాడు.

వీరి ఫ్యాక్టరీలో ముంబయికి చెందిన కెమిస్ట్ మాదక ద్రవ్యాలను తయారు చేయగా.. వాటి నాణ్యతను ఢిల్లీలో ఉండే మెక్సికన్ ముఠా సభ్యుడు పరీక్షించేవాడని ఎన్‌సీబీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో ఎన్‌సీబీ గుజరాత్‌లోని గాంధీ నగర్, అమ్రేలి, రాజస్థాన్‌లోని జోధ్‌పుర్, సిరోహి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ డ్రగ్ ల్యాబ్‌లను కనుగొన్నారు.




## జగన్ ఎవరో నాకు తెలియదు!: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్


రౌడీషీటర్, వైకాపా సానుభూతి పరుడైన బోరుగడ్డ అనిల్ కుమార్.. పోలీసుల విచారణకు సహకరించకుండా, సరైన సమాధానాలు చెప్పకుండా వాస్తవాలు దాస్తున్నట్లు తెలుస్తోంది.

కర్లపూడి బాబు ప్రకాష్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బోరుగడ్డను న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇవ్వగా.. గుంటూరు అరండల్ పేట పోలీసులు రెండు రోజులుగా విచారణ చేస్తున్నారు. మాజీ సీఎం జగన్‌కు మద్దతుగా, నాటి ప్రతిపక్ష నేతలపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు ఎందుకు చేశావని పోలీసులు ప్రశ్నించగా.. నిజాలు చెబితే వైకాపా నుంచి ప్రాణహాని ఉండొచ్చనే భయంతో పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది.

అసలు మాజీ సీఎం జగన్ ఎవరో తెలియదని బోరుగడ్డ సమాధానం చెప్పడానికి ఆ పార్టీ పెద్దల బెదిరింపులు కారణమై ఉండొచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

## ప్రజలకు 'ఉచిత ఇసుక' అమలు చేస్తున్నాం: మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖ: గత ప్రభుత్వ పాలనలో మైనింగ్ వ్యవస్థను మాఫియా మాదిరిగా చేశారని.. భూ ఆక్రమణలు, దౌర్జన్యాలు, దాడులతో పరిశ్రమలను దెబ్బతీశారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రాష్ట్రంలో పారిశ్రామిక వ్యవస్థ మొత్తాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. అలాంటి కష్టాల నుంచి తమను తాము కాపాడుకోవాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారన్నారు. విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మైనింగ్ అధికారులు, క్వారీ యజమానులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. "ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. 80 శాతానికి పైగా పూర్తి అయిన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోలవరానికి కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు తీసుకొచ్చాం. నాలుగు నెలల్లో ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ప్రతి రంగంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే శ్వేత పత్రాలు విడుదల చేశాం. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించి తీరుతాం అనే మాటకు కట్టుబడి ఉన్నాం.. అమలు చేస్తున్నాం కూడా. నిర్మాణ రంగాన్ని బలోపేతం చేయడం కోసం ఉచితంగా ఇసుక అందించడమే కాకుండా.. జీఎస్టీని కూడా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నాం. గత సీఎం చర్యల కారణంగా మన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఇసుక




తవ్వకాలకు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ ఉన్నంత మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. బోటు మెన్ అసోసియేషన్ల ద్వారా కూడా ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చాం.

సొంత వాహనాల్లో ఇసుక తీసుకెళ్లేవారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తున్నాం. రవాణా ఛార్జీలు, లోడింగ్ ఛార్జీలు చెల్లించి లారీల ద్వారా కూడా తీసుకెళ్లేందుకు అనుమతించాం. రాష్ట్రంలో నిర్మాణ రంగం అభివృద్ధి బాటలో నడవాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుంది" అని మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

## సజ్జలను నిలదీసిన వైకాపా కార్యకర్తలు



పామర్రు: కష్ట కాలంలో అండగా ఉండాల్సిన నాయకులే పట్టించుకోకపోతే ఎలా అని వైకాపా కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని నిలదీశారు. కృష్ణా జిల్లా పామర్రులో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటికి సజ్జల వచ్చారు. ఈ విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. నేతలతో మాట్లాడి ఆయన వెళ్లిపోతుండగా.. కార్యకర్తలు అడ్డుకుని నిలదీశారు. ఇంతమంది కార్యకర్తలు వస్తే కనీసం పలకరించకుండా వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. ధైర్యంగా ఉండి పార్టీ కోసం పోరాడాలనే భరోసా ఇవ్వకుండా అలా ఎలా వెళ్లిపోతారని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక సజ్జలతో పాటు అక్కడి నేతలు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

## ఏపీలో 'ఉచిత గ్యాస్' బుకింగ్స్ ప్రారంభం

అమరావతి: ఏపీలో దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కోసం బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఆధార్, రేషన్ కార్డు ఉన్న ప్రతి గ్యాస్ వియోగదారుకు రూ.851 రాయితీ రానుంది. నాలుగు నెలలకొక సిలిండర్ చొప్పున ఏటా 3 ఉచిత సిలిండర్లు పంపిణీ చేయనున్నారు.

వినియోగదారుడు చెల్లించిన 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ అవుతుంది. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు మొదటి సిలిండర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకం ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుంది.



# ప్రియాంక అరుళ్ మోహన్.. బ్లాక్ డ్రెస్సులో స్టన్నింగ్ గ్లామర్ షో

ప్రియాంక అరుళ్ మోహన్ తాజాగా తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇందులో ఆమె బ్లాక్ అవుట్‌ఫిట్‌లో గ్లామర్ కాంబినేషన్‌తో కనిపిస్తోంది. అమీత్ అగర్వాల్ డిజైన్ చేసిన ఈ ప్రత్యేక డ్రెస్ ఆమె అందంలో బాగా కలిసిపోయింది. స్టైలింగ్ లో ఆమె స్టిల్ కూడా ఈ అవుట్‌ఫిట్‌కు పూర్తిగా న్యాయం చేసింది. ఫోటోగ్రాఫర్ పళణియప్పన్ సుబ్రహ్మణ్యం కెమెరాతో తీసిన ఈ ఫొటోస్ బ్యాక్ కలర్ బ్యాక్‌గ్రౌండ్‌తో ప్రియాంక అందాన్ని హైలైట్ చేస్తున్నాయి. ప్రియాంక మోహన్ తన హుందాతనంతో హృదయాలను గెలుచుకుంటూ పోతున్నారు. ఆమె తన ప్రత్యేకమైన శైలి, అందంతో ప్రతి ఫోటోలోనూ ఒక కొత్తగా కనబడుతున్నారు. ఈ లుక్‌లో ప్రియాంక లుక్స్ తో పాటు ఒక



ప్రత్యేకమైన గ్లామర్‌ను ప్రదర్శిస్తోంది. ఫ్యాషన్‌కు సంబంధించిన జ్యువెలరీ, ఆరుస్ జ్యూవెల్స్ ఆమెకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. ఇందులో స్టైలిష్ కాన్సెప్ట్ తో ఆమె తనకున్న అందాన్ని మళ్లీ రీడిఫైన్ చేసుకున్నారు. కెరీర్ విషయానికి వస్తే, ప్రియాంక మోహన్ ప్రస్తుతం టాలీవుడ్, కోలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'సరిపోదా శనివారం' వంటి హిట్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఓజీ' లో కూడా కనిపించబోతున్నారు. ఇక విశ్వక్ సేన్ సరసన నటించబోయే మరో సినిమాతో ఆమె జోరు కొనసాగిస్తోంది. ఇలా ప్రతి సినిమాలో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తున్న ప్రియాంక, ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో తన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఆమె తన ప్రతి ప్రాజెక్ట్‌లోనూ ఒక కొత్త ఛాలెంజ్ లాంటి క్యారెక్టర్ తో కనిపిస్తోంది, నటనలో మరింత కొత్తగా నిరూపించుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ %ూా+% సినిమాలో ఆమె పాత్ర ప్రత్యేకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. తప్పకుండా అమ్మడి రేంజ్ ను పెంచే సినిమాగా %ూా+% నిలుస్తుందని చెప్పవచ్చు.

# చరణ్ రైమీకి రేణు దేశాయ్ ధన్యవాదాలు!

రేణు దేశాయ్ మూగ జీవాల సంరక్షణార్థం శ్రీ ఆద్య యూనిమల్ షెల్టర్ ఎన్జీవో ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎంతో కాలంగా మూగ జీవాల కోసం ఇలాంటి ఎన్జీవో స్థాపించాలని అమె అనుకుంటున్నారు. అది ఇప్పటికీ సాధ్యమైంది. ఈ నేపథ్యంలో శ్రీ ఆద్య యానిమల్ షెల్టర్ కి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చని పోస్ట్ చేసారు. అలాగే ఓ అంబులెన్స్ కూడా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉపాసన కూడా చేయి కలిపారు. ఈ సంస్థ కోసం ఓ అంబులెన్స్‌ను కొనుగోలు చేశానని, దీనికి ఉపాసన తనవంతు సాయం అందించారని రేణు దేశాయ్ తెలిపారు. రామ్‌చరణ్ పెంపుడు శునకం రైమీ పేరుతో ఉపాసన ఈ సాయం చేసినట్టు తెలిపారు. అంబులెన్స్ కొనుగోలు చేసేందుకు విరాళం అందించిన రైమీకి ధన్యవాదాలు అని రేణుదేశాయ్ పోస్ట్ పెట్టారు. దీనికి ఉపాసనను ట్యాగ్ చేశారు.



ఉపాసన మంచి తనాన్నిపలువురు మెచ్చుకుంటున్నారు. సహాయాలు చేయడంలో ఉపాసన ఎప్పుడూ ముందుంటారు. రామ్ చరణ్ తరుపున మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా ఆ బాధ్యతలన్నీ తానే తీసుకుంటారు. చరణ్ బిజీ షెడ్యూల్ దృష్ట్యా ఆ వ్యవహారాలన్నీ ఆమె చూసుకుంటారు. ఇక రేణు ఎన్జీవో విషయానికి వస్తే తన స్వచ్ఛంద సంస్థకు విరాళాలు ఇవ్వాలని ఇన్‌స్టాగ్రాం వేదికగా రేణుదేశాయ్ విజ్ఞప్తి చేశారు. తమవంతు బాధ్యతగా ఎవరైనా ప్రతి నెల కనీసం రూ. 100 కూడా సాయం చేయవచ్చునని పేర్కొన్నారు. ఇది తన వ్యక్తిగత అవసరాల కోసం కాదని, తాను స్థాపించిన స్వచ్ఛంద సేవా సంస్థ కోసం ఖర్చు చేస్తానన్నారు. మూగ జీవాల కోసం ఏదైనా చేయాలని తనకు చిన్నప్పటి నుంచి కోరిక అని రేణు వివరించారు. మూగ జీవాల కోసం అక్కినేని నాగార్జున భార్య అమల కూడా పెటా అనే ఎన్జీవోను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చాలా కాలంగా అమల ఈ సంస్థను నడుపుతున్నారు. మూగ జీవాల కోసం ఎంతో శ్రమిస్తున్నారు. ఇప్పుడా మార్గంలో రేణు దేశాయ్ కూడా వెళ్తున్నారు.




# బాలయ్య ముందు తొడ కొట్టిన యంగ్ హీరో!



నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న టాక్ షో 'అన్‌స్టాపబుల్' సీజన్ 4 నడుస్తోంది. చంద్రబాబు నాయుడు ఎపిసోడ్ తో ప్రారంభం అయిన సీజన్ 4లో సెకండ్ ఎపిసోడ్ కోసం మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ హాజరు అయ్యారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసిన ఆ ఎపిసోడ్ నుంచి తాజాగా కొన్ని స్టిల్స్‌ని విడుదల చేయడం జరిగింది. ఈవారంలో దుల్కర్ సల్మాన్ నటించిన 'లక్కీ భాస్కర్' సినిమా విడుదల అవ్వబోతుంది. ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా అన్ స్టాపబుల్ షో లో దుల్కర్ సల్మాన్‌తో పాటు దర్శకుడు వెంకీ అట్లూరి, హీరోయిన్ మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. ఎపిసోడ్ కి సంబంధించిన పోటోలు వైరల్ అవుతున్నాయి. ఎపిసోడ్‌లో భాగంగా బాలకృష్ణ తొడ కొట్టుడు గురించి టాపిక్ వచ్చిందట. దాంతో బాలయ్య తో పాటు సరదాగా దర్శకుడు వెంకీ అట్లూరి, హీరో దుల్కర్ సల్మాన్‌లు సైతం తొడ కొట్టారు. తొడ కొట్టడం అనగానే బాలయ్య గుర్తుకు వస్తారు. అలాంటి బాలయ్య ముందు దుల్కర్ సల్మాన్ తొడ కొట్టిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాలకృష్ణ టాక్ షో కి దుల్కర్ సల్మాన్ రావడం కచ్చితంగా ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాలున్న లక్కీ భాస్కర్ సినిమాకు అన్‌స్టాపబుల్ షో ప్రమోషన్ మరింత అంచనాలు పెంచవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సినిమాకు సంబంధించిన ప్రమోషన్‌లో భాగంగా దుల్కర్ సల్మాన్ గత వారం రోజులుగా హైదరాబాద్‌లోనే పలు మీడియా సమావేశాల్లో, ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఉన్నాడు. బాలకృష్ణ అన్‌స్టాపబుల్ సీజన్ 4 మొదటి ఎపిసోడ్‌కి ఎప్పటిలాగే మంచి స్పందన వచ్చింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ ఎపిసోడ్ లో పాల్గొనడం వల్ల అందరి దృష్టిని ఆకర్షించారు. చంద్రబాబు నాయుడు గురించిన పలు పర్సనల్ విషయాలతో పాటు, రాజకీయ విషయాల గురించి ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. బావ, బామర్ది సరదా ముచ్చట్లు సైతం ప్రేక్షకులను అలరించాయి. సీజన్ 4 కి మంచి స్టార్ట్ లభించింది అని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్ మొత్తం ప్రముఖ స్టార్స్ తో ఎపిసోడ్స్ ఉండబోతున్నాయి. రెండో ఎపిసోడ్ లక్కీ భాస్కర్ తో ఉండనుండగా, తదుపరి ఎపిసోడ్‌లో తమిళ్ స్టార్ సూర్య కంగువా కోసం పాల్గొనబోతున్నాడు. ఇటీవలే సూర్య కి సంబంధించిన ఎపిసోడ్ సైతం షూటింగ్ జరిగింది. కంగువా సినిమా ప్రమోషన్‌లో భాగంగా బాలకృష్ణ అన్‌స్టాపబుల్ షో లో సూర్య పాల్గొన్నాడని ఇప్పటికే ఆహా టీం అధికారికంగా ప్రకటన చేసింది.

తెలుగు టాక్ షోల్లో చాలా స్పెషల్ టాక్ షో గా అన్‌స్టాపబుల్ గత మూడు సీజన్‌లు నిలచాయి. నాలుగో సీజన్ సైతం ఏమాత్రం తగ్గకుండా అలాగే ఉంటుందని అంటున్నారు. అయితే ఈసారి ఎక్కువగా సినిమా ప్రమోషన్ ఎపిసోడ్స్ పడటం ఏమాత్రం బాగాలేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. త్వరలోనే పుష్ప 2 కోసం అల్లు అర్జున్, సుకుమార్, రష్మిక మందన్నలు అన్ స్టాపబుల్ షో కి వచ్చే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి.

# శ్రీలీల వర్సెస్ పూజ.. సీన్ రివర్స్?




సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబోలో గుంటూరు కారం మూవీ తెరకెక్కిన విషయం తెలిసిందే. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద ఊహించని వసూళ్లను సాధించింది. అయితే ఆ సినిమాలో హీరోయిన్ గా తొలుత పూజా హెగ్డేను ఫిక్స్ చేశారు మేకర్స్. కానీ ఆమె ప్రాజెక్టు నుంచి తప్పుకోగా యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటించారు. ఇప్పుడు ఓ క్రేజీ ప్రాజెక్ట్ లో శ్రీలీల నటిస్తారని ఎప్పటి నుంచో వార్తలు వస్తుండగా.. ఇప్పుడు ఆమె ప్లేస్ లో పూజ నటిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఆ వివరాలు మీకోసం! బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ అప్ కమింగ్ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా ఛాన్స్ అందుకున్నారని చాలా నెలలుగా ప్రచారం సాగుతున్న విషయం తెలిసిందే. వారిద్దరి కాంబోలో వరుణ్ ధావన్ తండ్రి, దర్శకుడు డేవిడ్ ధావన్ ఓ కామెడీ మూవీని తెరకెక్కించనున్నారని వార్తలు వచ్చాయి. దీంతో శ్రీలీల.. ఆ సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెడుతుందని అంతా అనుకున్నారు. కొద్ది రోజుల క్రితం, ఆ విషయంపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఎవరినీ హీరోయిన్ గా ఫిక్స్ చేయలేదని చెప్పారు. కానీ శ్రీలీలనే హీరోయిన్ గా నటిస్తారని టాక్ వినిపిస్తూనే ఉంది. అయితే ఇప్పుడు మరో న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. శ్రీలీల ప్లేస్ లో పూజా హెగ్డేను మేకర్స్ సెలెక్ట్ చేసుకున్నారని తెలుస్తోంది. తొలిసారి వరుణ్, పూజ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని సమాచారం. రీసెంట్ గా ఓ వేడుకలో తాను పలు బాలీవుడ్ సినిమాల్లో నటిస్తున్నానని, ఆయా మేకర్స్ అనౌన్స్మెంట్స్ ఇస్తారని పూజా తెలిపారు. ఇప్పుడు అందులో ఒకటి వరుణ్ ధావన్ మూవీ అని టాక్ వినిపిస్తోంది. సీతారామం మూవీతో టాలీవుడ్ సినీ ప్రియులకు బాగా దగ్గరైన బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ కూడా మరో హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్నారు. అలా శ్రీలీల ప్లేస్ లో పూజా హెగ్డేను తీసుకున్నారని వార్తలు వస్తుండగా.. గుంటూరు కారం మూవీ టైమ్ లో జరిగిన సీన్.. ఇప్పుడు రివర్స్ లో రిపీట్ అయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే డేవిడ్ ధావన్.. తన సినిమాల్లో హీరోయిన్స్ ను గ్లామరస్ గా చూపిస్తారు. ప్రేక్షకులను ఓ రేంజ్ లో మెప్పిస్తారు.

ఇప్పుడు పూజ, మృణాల్ ను ఎలా ప్రెజెంట్ చేస్తారో చూడాలని అంటున్నారు. హై జవానీతో ఇష్క్ హోనాహై అనే టైటిల్ ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది అక్టోబర్ 2వ తేదీన సినిమాను రిలీజ్ చేయనున్నారని సమాచారం.

# చీరలో రాశి ఖన్నా.. అందమే అసూయ పడేలా..

టాలీవుడ్ హీరోయిన్ రాశీ ఖన్నా తాజాగా తన అందంతో అందరినీ ఆకట్టుకుంటూ మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అయింది. పసుపు రంగు చీరలో దిగిన ఈ తాజా ఫొటో షూట్‌లో ఆమె చీరకట్టులో సంప్రదాయ సొగసుతో కనిపిస్తూ ఫ్యాన్స్‌ని అలరించింది. ఈ పిక్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన రాశీ, "నా ఔట్‌ఫిట్‌లా ప్రకాశవంతమైన దీపావళి మీకు ఉండాలని కోరుకుంటున్నా!" అంటూ సందేశాన్ని జోడించింది. రాశీ ఖన్నా తన కెరీర్‌లో ఎన్నో విభిన్న పాత్రలను పోషిస్తూ సౌత్ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. ఈమె గతంలో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటించి ప్రేక్షకులను మెప్పించింది. 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన రాశీ, తర్వాత



'సుప్రీమ్,' 'జై లవ కుశ,' 'తొలిప్రేమ,' 'ప్రతిరోజూ పండగే' వంటి హిట్ చిత్రాలలో నటించి తన టాలెంట్ ను చూపించింది. ఇటీవల ఆమె చేసిన 'అరణ్మనై 4' అనే తమిళ హారర్ కామెడీ మూవీ ఘన విజయం సాధించడంతో రాశీ ఖన్నా సక్సెస్ ట్రాక్‌లో ఉన్నట్లు ఫిల్మ్ క్రిటిక్స్ అభిప్రాయపడుతున్నారు. ఇక ప్రస్తుతం రాశీ ఖన్నా తన చేతిలో ఉన్న మరో తెలుగు మూవీ 'తెలుసుకదా' కోసం కష్టపడుతోంది. జోడీగా సిద్ధూ జొన్నలగడ్డతో కలిసి ఆమె నటిస్తోంది. ఈ సినిమాతో రాశీ టాలీవుడ్‌లో మళ్లీ ఫేమ్ సంపాదించేందుకు సిద్ధమవుతోంది. రాశీ ఖన్నా తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌తో కూడా మంచి పేరు తెచ్చుకుంది. ఆమె ధరించిన ప్రతి ఔట్‌ఫిట్‌ను సోషల్ మీడియాలో అభిమానులు తెగ ప్రశంసిస్తున్నారు. రాశీ తన ఫొటో షూట్‌లను రెగ్యులర్‌గా షేర్ చేస్తూ ఫ్యాన్స్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటోంది. లేటెస్ట్ ఫొటో షూట్ లో చీరలోని అందం పసుపు రంగుతో ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. డిజైనర్ డాలీ జి స్టూడియో ఔట్‌ఫిట్‌లో ఆమె ఆకర్షణీయంగా కనిపిస్తూ అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

# పొట్టి డ్రెస్సులో బచ్చన్ బ్యూటీ.. కిర్రాక్ లుక్

మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ భాగ్యశ్రీ బోర్సే. హిందీలో 'యారియాన్ 2' మూవీతో నటిగా ఈ బ్యూటీ తెరంగేట్రం చేసింది. తరువాత హిందీలోనే 'చందూ చాంపియన్' సినిమాలో నటించింది. తెలుగులో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాలోని సాంగ్స్ లో హరీష్ శంకర్ భాగ్యశ్రీని చాలా గ్లామరస్ గా చూపి అయితే 'మిస్టర్ బచ్చన్' మూవీ డిజాస్టర్ కావడంతో భాగ్యశ్రీ బోర్సేకి కమర్షియల్ హీరోయిన్ గా బ్రేక్ రాలేదు. అయిన కూడా ఆ మూవీ రిలీజ్ కాకుండానే విజయ్ దేవరకొండకి జోడీగా '%ఎఐ%12' మూవీలో హీరోయిన్ గా భాగ్యశ్రీ ఛాన్స్ అందుకుంది. పాన్ ఇండియా రేంజ్



లో తెరకెక్కుతోన్న ఈ సినిమాతో భాగ్యశ్రీ సూపర్ సక్సెస్ అందుకుంటాననే నమ్మకంతో ఉంది. దీంతో పాటు రీసెంట్ గా దుల్కర్ సల్మాన్, రానా కాంబినేషన్ లో ప్రారంభమైన సినిమాలో హీరోయిన్ గా కూడా భాగ్యశ్రీ ఖరారైంది. సరైన బ్రేక్ రాకుండానే భాగ్యశ్రీకి సోషల్ మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ పెరిగిపోయింది. టాలీవుడ్ లో నెక్స్ట్ స్టార్ హీరోయిన్ ఈమెనే అనేంతగా అందరిని ఆకర్షిస్తోంది. సరైన హిట్స్ రెండు పడితే ఇక భాగ్యశ్రీ స్పీడ్ ని ఎవరూ ఆపలేరని సినీ విశ్లేషకులు సైతం అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రామ్ లో అంత యాక్టివ్ గా లేదు. అయితే అప్పుడప్పుడు తన అప్డేట్స్ షేర్ చేసుకుంటూ ఉంటుంది.

గ్లామర్ ఫోటోలని కూడా పోస్ట్ చేస్తూ అందరిని ఆకర్షిస్తుంది. తాజాగా భాగ్యశ్రీ బోర్సే ఇన్ స్టాగ్రామ్ లో బ్లాక్ కలర్ స్కర్టుతో ఒక ఫోటోని షేర్ చేసింది. ఈ ఫోటోలో టోపీ పెట్టుకొని అదిరిపోయే స్మైల్ తో నెటిజన్లు చూపులు తిప్పుకోకుండా చేసేస్తుంది. భాగ్యశ్రీ ఈ లుక్స్ లో అందాల కలల దేవతలా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. చూడగానే రిఫ్రెష్ ఫీల్ ఇచ్చే అందం భాగ్యశ్రీ సొంతం అని ఆమెపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.






తిరుమల శ్రీవారిని తెలంగాణ మంత్రి కొండా సురేఖ, సినీ నిర్మాత నాగవంశీ దర్శించుకున్నారు. మంగళవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో వారు వేర్వేరుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# సర్దార్ పటేల్ కీర్తిని తుడిచిపెట్టే ప్రయత్నాలు జరిగాయి: అమిత్ షా

దిల్లీ: గతంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీర్తిని తుడిచిపెట్టడానికి, ఆయన వారసత్వాన్ని అణగదొక్కడానికి ప్రయత్నాలు జరిగాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దిల్లీలోని మేజర్ ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంలో జెండా ఊపి 'ఐక్యతా పరుగు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. భారత స్వాతంత్ర్య పోరాటం అనంతరం పటేల్ చొరవతోనే 550 సంస్థానాలు భారత్‌లో విలీనమై.. దేశం ఏకమైందని పేర్కొన్నారు. జూనాగఢ్, హైదరాబాద్, లక్షదీవులను భారత్‌లో కలిపేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయన్నారు. పటేల్ దేశం కోసం ఎంత చేసినప్పటికీ ఆయనకు భారతరత్న ఇవ్వడానికి గత ప్రభుత్వం చాలాకాలం నిరాకరించిందని విమర్శించారు. సర్దార్ పటేల్ 1950లో మరణించారని ఆయన మరణించిన 41 సంవత్సరాల తర్వాత 1991లో ఆయనకు భారతరత్న పురస్కారాన్ని అందించారని అమిత్ షా పేర్కొన్నారు. అయితే ప్రధాని మోదీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కెవాడియాలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పటేల్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, సముచిత రీతిలో సత్కరించారని అన్నారు. స్వాంతత్ర్యం వచ్చిన నాటినుంచి నేటివరకు దేశ ప్రజలు ఎంతో ఐక్యంగా ఉన్నారన్నారు. 2047 నాటికి భారత్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చెందిన దేశంగా, ప్రపంచంలోనే అగ్రగామిగా మార్చేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతిఏటా పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31ని 'రాష్ట్రీయ ఏక్తా దివస్' గా జరుపుకుంటోందని.. ఇందులోభాగంగా 'రన్ ఫర్ యూనిటీ'ని నిర్వహిస్తామని.. అయితే ఈ ఏడాది అదే తేదీలో దీపావళి పండగ ఉన్నందున రెండు రోజులు ముందుగానే నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహంగా గుజరాత్‌లోని సర్దార్ పటేల్ విగ్రహం చరిత్ర సృష్టించింది. దీని ఎత్తు 597 అడుగులు. ఇది గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో ఉంది. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, ఆ తర్వాత భారత ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు పటేల్ చేసిన కృషికి స్మృతిగా దీనిని నిర్మించారు. 180 కి.మీ. వేగంతో గాలులు వీచినా.. రెక్టార్ స్కేలుపై 6.5 తీవ్రతతో భూకంపం వచ్చినా తట్టుకునేలా విగ్రహాన్ని నిర్మించారు. గత వందేళ్లలో గరిష్టంగా వచ్చిన వరద ముప్పును అంచనా వేసి.. దాన్ని తట్టుకునేలా పటేల్ విగ్రహాన్ని ఏర్పాటుచేశారు.

# ఇది ప్రత్యేకమైన దీపావళి : రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ



ఈసారి ప్రత్యేకమైన దీపావళిని మనం చూస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ధన త్రయోదశి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు. మరో రెండ్రోజుల్లో ప్రత్యేకమైన దీపావళి జరుపుకోబోతున్నాం. దాదాపు 500 ఏళ్ల తర్వాత అయోధ్య ఆలయంలోకి శ్రీరాముడు కొలువైనవేళ వచ్చిన తొలి దీపావళి ఇది. ఈ ప్రత్యేక వేళకు మనం ప్రత్యక్ష సాక్షులుగా ఉంటున్నాం. నేడు 51 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్నాం" అని ప్రధాని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 40 ప్రదేశాల్లో రోజ్‌గార్ మేళాలను నిర్వహించారు. వీటిల్లో వివిధ మంత్రిత్వశాఖల్లో నియామకాలను చేపట్టారు. ఈ ఉద్యోగాల్లో కొత్తగా చేరిన వారందరికి 'కర్మయోగి ప్రారంభ్' విధానం కింద శిక్షణ ఇస్తున్నారు. ఐజీవోటీ కర్మయోగి పోర్టల్‌లో దాదాపు 1,400 కోర్సులను అందుబాటులోకి తెచ్చారు. దీనినుంచి వారికి వివిధ రంగాల్లో నైపుణ్యాలను నేర్పుతారు. తెలుగు రాష్ట్రాల్లోని విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో ఈ వేళాలను నిర్వహించారు. వైజాగ్‌లో వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఇక హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. 155 మందికి ఆయన నియామక పత్రాలు అందించారు.

# యువశక్తి సాయంతో ఎన్నో అద్భుతాలు చేయొచ్చు : కిషన్‌రెడ్డి



హైదరాబాద్: నగరంలోని భారతీయ విద్యాభవన్ పాఠశాలలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఎంపికైన 155 మందికి నియామక పత్రాలు అందించారు. అనంతరం కిషన్‌రెడ్డి ప్రసంగించారు. "కేంద్ర విభాగాల్లో ఖాళీలు ఉండకూడదనే ప్రతి నెలా రోజ్‌గార్ మేళా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 9 లక్షల మందికి నియామక పత్రాలు అందించాం. ఇవాళ దేశవ్యాప్తంగా 51 వేల మందికి నియామక పత్రాలు అందిస్తున్నాం. వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. వచ్చే 25 ఏళ్లపాటు మనకు అమృత కాలమని ప్రధాని మోదీ అంటారు. యువశక్తి సాయంతో మనం ఎన్నో అద్భుతాలు చేయొచ్చు. అనేక దేశాల్లో యువత తగ్గుతోంది.. మనవద్ద పుష్కలంగా ఉంది. ఇవాళ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. శాంతిభద్రతలు సరిగా లేకుంటే దేశంలోకి పెట్టుబడులు రావు. ఉగ్రవాద చర్యలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. వ్యవసాయ విధానాల్లో మార్పులు తెస్తున్నాం. విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. విద్యుదుత్పత్తి పెంచి అన్ని రంగాల అభివృద్ధికి సహకరిస్తున్నాం" అని కిషన్‌రెడ్డి అన్నారు. రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు.

**సర్దార్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం..** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. "ఇవాల్టి నుంచి సర్దార్ పటేల్ జయంతి వేడుకలను నిర్వహించాలని నడ్డా ఆదేశించారు. ఏడాది పాటు ప్రతి గ్రామంలో జయంతి వేడుకలు నిర్వహిస్తాం. తెలంగాణ ప్రజలు, అమరవీరుల కుటుంబాలు ఈ వేడుకల్లో పాల్గొనాలి" అని కోరారు. ఏక్ పోలీస్ విధానంపై పోలీస్ సంఘాలు, కుటుంబాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలన్నారు. అవసరమైతే రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలని.. బర్తరఫ్ చేసిన వాళ్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు.

# కేటీఆర్ లీగల్ నోటీసులకు సమాధానమిచ్చిన బండి సంజయ్

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జారీ చేసిన లీగల్ నోటీసులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సమాధానమిచ్చారు. లీగల్ నోటీసులో కేటీఆర్ చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని, నిరాధారమైనవని పేర్కొన్నారు.

ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారని ఆయనకు కేటీఆర్ లీగల్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ వ్యవహారాల్లో తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ నోటీసులు ఇచ్చారు. వారంలోపు క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదన్నారు.

# కోటి విలువైన స్థలం కబ్జా.. సహకరించిన సబ్‌రిజిస్ట్రార్ జ్యోతి అరెస్ట్

హైదరాబాద్: ఓ ఖాళీ స్థలపై కన్నేసిన కొందరు.. ఏకంగా ఆ స్థల యజమాని మృతి చెందినట్లు నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించారు. సబ్ రిజిస్ట్రార్ సాయంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఇందులో కీలక సూత్రధారిగా ఉన్న బారాస మహిళా నేత, మరో ఐదుగురిని ఇప్పటికే అరెస్టు చేసిన పోలీసులు సబ్‌రిజిస్ట్రార్ జ్యోతిని మంగళవారం అరెస్టు చేసి మేడ్చల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించింది.

**ఏం జరిగిందంటే?** ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌కు చెందిన లెండ్యాల సురేశ్‌కు సుభాష్‌నగర్–వెంకట్రాద్రినగర్‌లో 200 గజాల స్థలం ఉంది. ఆ స్థలం ఖాళీగా ఉన్నట్లు సుభాష్‌నగర్‌కు చెందిన భారాస మహిళా నేత పద్మజారెడ్డి, అలియాస్ కుత్బుల్లాపూర్ పద్మక్క(32) గుర్తించింది. హయత్‌నగర్‌కు చెందిన రేపాక కరుణాకర్(34)ను సంప్రదించింది. రూ.3.50 లక్షలు చెల్లించి నకిలీపత్రాల తయారీకి ఒప్పందం చేసుకుంది. ఇంటి యజమాని 1992లోనే మృతిచెందినట్లు మరణ ధ్రువపత్రం సృష్టించారు. రవిశంకర్ అనే వ్యక్తిని అతడి కుమారుడిగా సృష్టించారు. ఆధార్ కేంద్రం ఆపరేటర్‌గా గగనం నరేంద్ర(25) సహకారంతో హరీశ్ అనే వ్యక్తిని రవిశంకర్‌గా చూపించేందుకు నకిలీ పాన్‌కార్డు తయారు చేయించారు. దాంతో ఆధార్‌లో పేరు మార్పులు చేశారు. 2023 ఫిబ్రవరిలో కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అప్పటి అధికారిణి జ్యోతి సాయంతో పద్మజారెడ్డి సోదరి నాగిరెడ్డి కోమలకుమారికి ఈ స్థలాన్ని రవిశంకర్ విక్రయించినట్లు రిజిస్ట్రేషన్ పూర్తి చేయించారు. నిందితుల వద్ద పోలీసులు నకిలీ పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, స్కానర్ తదితర పరకరాలను స్వాధీనం చేసుకున్నారు. స్థల యజమాని లెండ్యాల సురేశ్ ఫిర్యాదుతో స్థలం కబ్జా బాగోతం బయటికొచ్చింది.

# దేవుళ్లపై ఒట్లు వేసి హామీలు మరిచారు.. సీఎం రేవంత్‌పై హరీష్‌రావు ధ్వజం



వనపర్తి: అక్రమ కేసులు పెడుతూ కొందరు పోలీసులు అతిగా వ్యవహరిస్తున్నారని.. వారి పేర్లు డైరీల్లో రాసిపెడుతున్నామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హెచ్చరించారు. తెలంగాణలో కొత్తపథకాలు అటుంచి పాత పథకాలను కూడా సీఎం రేవంతరెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే సోయి రేవంత్ ప్రభుత్వానికి లేదని హరీష్‌రావు విమర్శించారు.

**రుణమాఫీకి ఎగనామం..** తెలంగాణలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని అన్నారు. అనేక కొర్రీలు పెట్టి రేవంత్ ప్రభుత్వం రుణమాఫీకి ఎగనామం పెడుతోందని మండిపడ్డారు. ఇవాళ(మంగళవారం) వనపర్తిలో హరీష్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ... దేవుళ్లపై ఒట్లు వేసి హామీలు మరిచారని మండిపడ్డారు. దేవుళ్ల మీద ఒట్టు పెట్టిన పాలకుడు.. ఇచ్చిన మాట తప్పితే తెలంగాణకే అరిష్టమని అన్నారు. ఎనముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగ వేతల రేవంత్ రెడ్డి అని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు వదిలిపెట్టమని హెచ్చరించారు. ఢిల్లీకి మూటలు పంపేందుకు..లక్షా 50 వేల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణకు డబ్బులిచ్చే సీఎం రేవంత్‌రెడ్డికు రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు నిధులు లేవా అని హరీష్‌రావు నిలదీశారు.

**నిరుద్యోగులకు తీవ్ర నష్టం..** రైతుబంధు ఇవ్వని కాంగ్రెస్ పార్టీని ఉరికించాలని హరీష్‌రావు హెచ్చరించారు. పత్తిరైతులకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డెడ్‌లైన్లు మారాయి.. పత్రికల్లో హెడ్‌లైన్లు మారాయి..కానీ రైతు రుణమాఫీ మాత్రం ఓ లైనుకు రాలేదని విమర్శించారు. సర్కార్ ధవఖానాల్లో మందులు కూడా లేవని చెప్పారు. జీఓ నెంబర్29తో నిరుపేద నిరుద్యోగులకు తీవ్ర నష్ట కలుగుతోందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు..పోలీసు పాలన సాగుతోందని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌కు పాలన మీద పట్టు లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదన్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే తెలంగానలో కరెంట్ బిల్లులు పెరగలేదని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ ప్రభుత్వం మెడలు వంచుతామని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల బాకీ పడిందని అన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం జరుగుతుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు.

# కేసీఆర్ కుటుంబంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు



విశాఖపట్నం/హైదరాబాద్, అక్టోబర్ 29: మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ (%ఖఅఱశీఅ వీఱఅఱర్వతీ ధీఱఅఙఱ ఝఱఅయిఱఎ%) సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం బూతు పురాణం కుటుంబమని.. ఉదయం లేస్తే చాలు ఆ పార్టీ నేతలు అందరూ బూతులే మాట్లాడుతారన్నారు. వాళ్ళు చేస్తే సంసారం మిగిలిన వాళ్ళు చేస్తే వ్యభిచారం అన్నట్టు మాట్లాడతారంటూ మండిపడ్డారు. కేసీఆర్ తిట్టినట్లు బూతులు ఎవరు తిట్టలేదని.. తండ్రి లాగే కొడుకు కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని అన్నారు. "బూతులు తిట్టేవాడు నోటీసిస్తే దానికి విలువ ఉంటుందా. నేనెప్పుడూ తిట్టలేదు.. కేవలం విమర్శ మాత్రమే చేశాను. కేటీఆర్ పంపిన నోటీసుకు నేను సమాధానం కూడా ఇచ్చాను.. అంతేకాదు నోటీసుకు నోటీసు కూడా ఇచ్చాను" అని తెలిపారు.

**ఇప్పుడెవరైనా దావత్‌లు చేసుకుంటారా...** అలాగే జన్వాడ ఫామ్ హౌస్ ఘటనకు సంబంధించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపైనా కేంద్రమంత్రి విమర్శలు గుప్పించారు. "ఫామ్ హౌస్‌లో దావతులు పెట్టడానికి సిగ్గుండాలి . దసరాకి దావతులు చేసుకుంటారు... దీపావళికి ఎవరైనా దావతులు చేసుకుంటారా. దీపావళికి దావతులు కాదు.. లక్ష్మీ పూజలు చేసుకోవాలి" అంటూ హితవుపలికారు.

**రేవంత్ సర్కార్‌పైనా...** అలాగే రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఆర్ కే హెచ్ సర్కార్ నడుస్తోంది (రేవంత్, కేటీఆర్, హరీష్ రావు) అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌లో బావా బామ్మర్దుల పంచాయతీ నడుస్తోందన్నారు. కేసీఆర్ కొడుకుకి ట్విట్టర్ టిల్లు అని పేరు పెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటే అని అన్నారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ కొడుకు ఇద్దరూ ఒకటే అని.. తనకు భయపడి కేసీఆర్ కొడుకు నోటీసు ఇచ్చారన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఏమైనా అయితే కేసీఆర్ మాట్లాడరని.. జైలుకు వెళ్లినా స్పందించరన్నారు. కానీ కేసీఆర్ కొడుకు బావమరిదికి ఏమైనా అయితే మాత్రం.. డీజీపీతో మాట్లాడతారా అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్‌ను, బీఆర్ఎస్‌ను ధీటుగా ఎదుర్కొనే పార్టీ కేవలం బీజేపీ మాత్రమే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే మెడలు వంచుతామన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని.. మూసీ పేరుతో పేదలు ఉసురు పోసుకుంటే ఊరుకోమని హెచ్చరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీని వెంటాడుతాం.. వేటాడుతామన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తామన్నారు. పోలీసులు దాడి చేసినప్పుడు రాజ్ పాకాల పోలీసులు పక్కనే ఉన్నారని.. తర్వాత మాయమైపోయాడన్నారు. ఫామ్ హౌస్‌లో కేసీఆర్ కొడుకు కుటుంబ సభ్యులను తప్పించింది ఎవరని ప్రశ్నించారు. చివరికి కొండను తవ్వి ఎలుకను కూడా రేవంత్ సర్కార్ పట్టలేకపోయిందంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

# సిద్దిపేట జిల్లాలో దారుణం.. మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం



హుస్నాబాద్: సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. హుస్నాబాద్ పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి వివరించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు.. బాలిక ఉంటున్న కాలనీకి చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు సీఐ తెలిపారు.

# వ్యవస్థల విధ్వంసంతో ప్రమాదకర రూపంలో ఆశ్రిత పెట్టుబడులు : రాహుల్ గాంధీ



దిల్లీ: చిన్న చిన్న ఇన్వెస్టర్లకు రక్షణగా నిలవాల్సిన సెబీ ఛైర్‌పర్సన్ మాధబి బుచ్ అక్రమాలకు పాల్పడుతూ అదానీ ప్రయోజనాలను పరిరక్షిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. అదానీ సంస్థల విలువలను అమాంతం పెంచేందుకు ఉపయోగపడటమే కాకుండా ఆ సంస్థల విస్తరణకూ మాధబి బుచ్ పూర్తి సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. ఆమె అక్రమాలు ఊహించిన దాని కన్నా ఎంతో అధికంగా ఉన్నాయంటూ సామాజిక మాధ్యమంలో రాహుల్ గాంధీ ఓ వీడియోను పోస్ట్ చేశారు. మోదీ ప్రభుత్వం దేశ సంపద అంతా కొందరి వద్దే పోగుపడేలా చేస్తోందని మండిపడ్డారు. వ్యవస్థల విధ్వంసమే మరింత ప్రమాదకర రూపంలో ఆశ్రిత పెట్టుబడిదారులకు అవకాశాలను కల్పిస్తోందని ధ్వజమెత్తారు. స్టాక్‌మార్కెట్‌లో చిన్న ఇన్వెస్టర్లు మోసపోకుండా కాపాడాల్సిన బాధ్యత సెబీ ఛైర్‌పర్సన్‌దేనని స్పష్టం చేశారు. విరుద్ధ ప్రయోజనాలను పొందుతున్న మాధబి బుచ్‌ను శిక్షించకుండా రక్షిస్తోంది ఎవరని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా వల్లే ఆమె సెబీ ఛైర్‌పర్సన్ పదవిలో ఉన్నారని తెలిపారు. 'ఆమె అక్రమాలపై దర్యాప్తు సంస్థలు దృష్టిసారించడంలేదు. మీడియా ప్రశ్నించడం లేదు. ప్రభుత్వమూ చర్యలు తీసుకోవడం లేదు' అని రాహుల్ ఆక్షేపించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com